
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం 15 సెప్టెంబరు 2025





పెరుగుతూ.. తగ్గుతూ..

- 8 గంటల పాటు నిలకడగా గోదావరి
- స్నానఘట్టాలపై ప్రత్యక్షమైన కొండ చిలువ

భద్రాచలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరుగుతూ.. ఆ తర్వాత తగ్గుతోంది. శనివారం రాత్రి 9 గంటలకు 34అడుగులున్న గోదావరి నీటిమట్టం.. ఆదివారం ఉదయం 9 గంటలకు 35.9 అడుగులకు చేరుకుంది. 9 గంటలకు 36.2 అడుగులున్న గోదావరి నీటిమట్టం ఎనిమిది గంటల పాటు నిలకడగా ఉండి.. సాయంత్రం 5 గంటలకు 36.1 అడుగులకు తగ్గింది. సాయంత్రం 6 గంటలకు 36 అడుగులకు తగ్గింది. అయితే గోదావరి మరికొద్దిగా తగ్గి మళ్లీ స్వల్పంగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా.. భద్రాచలం వద్ద గోదావరి స్నానఘట్టాల పైకి నీరు ప్రవహిస్తుండడంతో.. బారికేడింగ్ ఏర్పాటు చేసి భక్తులను నిర్ణీత ప్రాంతం వరకే అనుమతిస్తున్నారు. ఇదిలా ఉండగా.. భక్తులు స్నానాలు చేసే ప్రాంతంలో కొండ చిలువ నీటిలో నుంచి బయటకు రావడంతో భయాందోళనకు గురైన వారు దాన్ని కొట్టి చంపారు.



జాతీయ రహదారుల భూసేకరణపై సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్

జాతీయ రహదారులకు భూసేకరణ పూర్తి చేయాలి

అధికారులకు కలెక్టర్ అనుదీప్ ఆదేశం

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారుల నిర్మాణ పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారుల నిర్మాణ పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. ఖమ్మం - దేవరపల్లి, నాగపూర్ - అమరావతి జాతీయ రహదారుల నిర్మాణాలు నిర్ణీత సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఖమ్మం-దేవరపల్లి రహదారికి ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ కోసం 6.22 ఎకరాల భూమిని సేకరించాలన్నారు. ఇందులో 3.16 ఎకరాలకు ఇప్పటికే అవార్డ్ పాస్ చేసినట్లు, మిగిలిన 3.06 ఎకరాలకు భూసేకరణకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. మేజర్ బ్రిడ్జి, వీయూపీలు ఈ నవంబర్ లోగా, ఆర్ఓబీ డిసెంబర్ లోగా పూర్తి చేయాలన్నారు. కొదుమూరు వద్ద 400 కేవీ ఈహెచ్‌టీ షిఫ్టింగ్ పనులు రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలన్నారు. నాగపూర్-అమరావతి ప్యాకేజీ-1 , 2 భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ లోగా పరిహార చెల్లింపులు చేసి, భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎన్ హెచ్ఏఐ పీడీ రామాంజనేయ రెడ్డి, దివ్య, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఏదీ సమీక్ష!?



ఖమ్మం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా.. ఎవరి శాఖల పరంగా వారే పర్యటనలు చేస్తూ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో ప్రధాన సమస్యలపై మాత్రం సమీక్షకు అవకాశం ఏర్పడడం లేదు. గత జూలై 27వ తేదీన కొత్తగూడెం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి పర్యటించి ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించినా.. అది హడావుడిగా ముగిసింది తప్పా, ప్రణాళికా బద్ధంగా సాగలేదు. సమయపాలన పాటించకపోవడం, నిర్దిష్ట ప్రణాళిక లేకపోవడంతో అన్ని శాఖలపై చర్చ చేయలేకపోయారు. దీంతో జిల్లాలో కీలకమైన సమస్యలపై ఎలాంటి చర్చ జరగలేదు. సమీక్షలో నిర్ణయాలు కూడా తీసుకోలేదు. ప్రధానంగా జిల్లాలో సీతారామ ఎత్తిపోతల పథకం కింద ఆయకట్టు స్థిరీకరణతో పాటు భూసేకరణ, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్వహణ చేపట్టాలి. దీనికి రూ.3500 కోట్లతో టెండర్లు అయినా భూసేకరణ ప్రక్రియ

‘ఇన్‌చార్జ్ మంత్రి గారు వెంటనే ఉమ్మడి జిల్లా సమీక్ష ఏర్పాటు చేసి ఎమ్మెల్యేలతో మాట్లాడి వారి నుంచి విజ్ఞప్తులు తీసుకుని నియోజకవర్గాల వారీగా సమస్యలు నాకు పంపించండి..’

ఈనెల 3వ తేదీన చంద్రుగొండలో నిర్వహించిన బహిరంగ సభలో ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం ఇది.

అయితే సీఎం సభ జరిగిన 15 రోజులు దాటుతున్నా.. ఇప్పటికీ ముఖ్యమంత్రి ఆదేశాలు అమల్లోకి రాలేదు. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి.

- ఉమ్మడి జిల్లాలో ఎన్నో సమస్యలు
- అసంపూర్తిగా సీతమ్మసాగర్ పనులు
- ముందుకు సాగని పలు నిర్మాణాలు
- గోదావరి పుష్కరాలపై ముందుచూపు కరువు
- ఉమ్మడి జిల్లా సమీక్ష నిర్వహణ ఇంకెప్పుడు !?
- అమలుకు నోచుకోని సీఎం ఆదేశాలు

జరగడం లేదు. దీనిపై ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలతో సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. అలాగే సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. బీఆర్ఎస్ హయాంలో దుమ్ముగూడెం వద్ద బ్రిటీష్ హయాంలో నిర్మించిన నావిగేషన్ ఆనకట్ట సమీపంలో సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టును రూపొందించారు. రూ.3426కోట్లతో 36.576 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 2021లో పనులు ప్రారంభించారు. 68మీటర్ల ఎత్తు, 1263మీటర్ల వెడల్పు, 67 క్రస్ట్ గేట్లతో ఈ కరకట్ట పనులు చేపట్టారు. రూ.1500 కోట్ల పనులు చేపట్టిన తర్వాత నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టును కొందరు ఆశ్రయించడంతో రెండేళ్లుగా పనులు నిలిచాయి. దీనికి సంబంధించి ట్రిబ్యునల్ కోర్టు నుంచి రూ.54కోట్లు అపరాధ రుసుం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినా.. ఇంకా ఈప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో సీతమ్మసాగర్ పనులు ప్రారంభం కాకుండా అసంపూర్తిగా ఉన్నాయి. దీనిపై కూడా సుదీర్ఘ చర్చ చేపట్టాలి. వాస్తవంగా సీతమ్మసాగర్ పూర్తయితే 320మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి జరిపేందుకు కూడా ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే ఈ పనులు మీద సమీక్ష చేయకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

పుష్కరాలపై ముందు చూపేది !?

గోదావరి పుష్కరాలు 2027 జూలై 23నుంచి ప్రారంభం కానున్నాయి. 12రోజులపాటు జరిగే ఈ పుష్కరాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర, దక్షిణ భారతదేశాలకు చెందిన లక్షలాది మంది భక్తులు పుష్కర స్నానాలకు వచ్చే అవకాశం ఉంది. 2015 పుష్కరాల్లో సుమారు కోటిమంది భక్తులు స్నానాలు ఆచరించారు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం మహాకుంభమేళా స్ఫూర్తితో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇంకా 23నెలల కాలం ఉన్నప్పటికీ.. ఇప్పటి నుంచే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి నది పరివాహకంలో రెండు వైపులా పుష్కరఘాట్ల నిర్మాణంతో పాటు ఉమ్మడి జిల్లాలో రహదారుల విస్తరణ, ఇరుకుగా ఉన్న కల్వర్టుల స్థానంలో కొత్త కల్వర్టుల ఏర్పాటు, డేంజర్ పాయింట్లు గుర్తించి అక్కడ ప్రత్యామ్నాయ ప్రణాళిక, గోదావరి పరివాహకంలో ఉన్న ఆలయాలను అభివృద్ధి చేయడం, పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు వసతి సౌకర్యాలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లు.. ఇదంతా పెద్దఎత్తున కార్యాచరణ చేపట్టాలి. రాష్ట్రమంత్రిగా రెండు తెలుగురాష్ట్రాల్లో గోదావరి పుష్కరాలను విజయంతంగా నిర్వహించిన అనుభవం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఉంది. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జ్ మంత్రి (మిగతా 6వ పేజీలో)

ఇతర సమస్యలెన్నో..

ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల్లో విద్య, వైద్యపరంగా తాగు, సాగునీటి సమస్యలు అనేకం ఉన్నాయి. ఇన్‌చార్జ్ మంత్రి ఉదయం నుంచి సాయంత్రం వరకు సమావేశం ఏర్పాటు చేసి ప్రాధాన్యత క్రమంలో చర్చించి ప్రతిపాదనలు చేస్తే త్వరితగతిన సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో రాబోయే పుష్కరాలపై కూడా ముందస్తు వ్యూహంతో ముందుకెళ్లే అవకాశం ఏర్పడనుంది.



నిరసన తెలుపుతున్న దృశ్యం

విధులకు హాజరు కాకుంటే చర్యలు తప్పవు

- టిమ్స్ డ్రైవర్ల ఫోన్లకు అధికారుల మెసేజ్‌లు
- మానవీయ దృక్పథంతో న్యాయం చేయాలంటున్న డ్రైవర్లు

భద్రాచలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విధులకు హాజరు కాకుంటే చర్యలు తప్పవని టిమ్స్ డ్రైవర్ల ఫోన్లకు అధికారుల నుంచి మేసెజ్‌లు వస్తున్నాయి. ఈ మెసేజుల్లో ‘ఈ నెల 8వ తేదీ నుంచి ఇప్పటివరకు మీరు విధులు ఆకస్మికంగా, ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు అవుతున్నారు. మీ సుదీర్ఘ గైర్హాజరు వల్ల ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. దీనివల్ల ఆర్టీసీ సేవలకు (మిగతా 6వ పేజీలో)



మాట్లాడుతున్న టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

టీజీఈ హైట్స్ ప్రాజెక్టును విజయవంతం చేయండి

టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సగటు ఉద్యోగి ఇంటి కలను సాకారం చేసే లక్ష్యంతో ప్రభుత్వం టీజీఈ జలజ ప్రాజెక్టును ఉద్యోగసంఘాలకు కట్టబెట్టిందని.. దీన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీని వాసరావు కోరారు. ఆదివారం పోలేపల్లి రాజీవ్ స్వగృహ సముదాయంలో ప్రభుత్వ ఉద్యోగుల హౌస్‌బిల్డింగ్ సొసైటీకి జలజ ప్రాజెక్టు దక్కడం పట్ల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఏలూరి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, ఖమ్మం జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ప్రభుత్వ ఉద్యోగులకు అతి తక్కువ ధరలో గృహ సదుపాయం కల్పించారని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న ఐ రైజ్డ్ బిల్డింగ్స్‌కు సరి సమానంగా ఈ ప్రాజెక్టును ఒక మోడల్ ప్రాజెక్టుగా రూపొందించి.. సంవత్సరంలోపే పూర్తిచేసి ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైన ఉపాధ్యాయులు, పెన్షనర్స్, గెజిటెడ్, నాన్ గెజిటెడ్, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలతో పాటు పోలీస్‌శాఖ ఉద్యోగులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఎస్‌బీఐ రిలేషన్‌షిప్ మేనేజర్ రవీంద్ర మాట్లాడుతూ.. ఎస్‌బీఐ లోన్ ఎలిజిబిలిటీ ఉన్న వారందరికీ లోన్ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. అలాగే హౌసింగ్ లోన్‌కు సంబంధించి ఉద్యోగుల పలు సందేహాలకు ఆయన వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం 26మంది ఎన్‌రోల్ చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదేన శ్రీనివాస్, టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ సెక్రటరీ విజయ్ కుమార్, శేషప్రసాద్, రాంబాబు, పుష్పరాజ్, మాధవరావు, వేల్పుల శ్రీను, వెంకటేశ్వర్లు, టీ ఎన్జీవోస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జెడ్, ఎస్.జైపాల్ విజయకుమార్, ఎర్ర రమేష్, తాళ్లూరి శ్రీకాంత్, పెద్దినేని రాధాకృష్ణ, పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భయం గుప్పిట్లో..

- ప్రమాదకర స్థాయిలో ‘పెదవాగు’ ప్రవాహం
- ప్రమాదంలో రింగ్‌బండ
- ప్రాజెక్టు నీటిమట్టం 23 క్యూసెక్కులకు చేరుకుంటే కష్టమే..
- ఏపీ, తెలంగాణలోని గ్రామాల్లో పంట పొలాల్లోకి చేరిన నీరు
- భయాందోళనలో ఆయకట్టు గ్రామాల ప్రజలు
- ఇరు రాష్ట్రాల అధికారులు అప్రమత్తం
- ఏపీఎస్‌ఆర్‌డీపీ బృందం, బోట్లు రాక

అశ్వారావుపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పెదవాగు ప్రాజెక్టు ప్రవాహం ప్రమాదకరస్థాయికి చేరుకుంది. దీంతో ఎప్పుడు.. ఏం జరుగుతుందో తెలియక.. ఆయుకట్టు గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో కాలం వెల్లదీస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అశ్వారావుపేట పరిసరాల్లో వర్షం దంచి కొట్టింది. దీనికి తోడు పెదవాగు ప్రాజెక్టు పై భాగమైన ఏపీలోని గుబ్బలమంగమ్మ కొండలు, అటవీ ప్రాంతంలో అతి భారీ వర్షం నమోదైంది. దీంతో వాగులు వంకలు పొంగి పొర్లి కొన్ని గంటల్లోనే ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరింది. గత ఏడాది జూలై 18న పెదవాగు ప్రాజెక్టు కట్టకు గండి పడడంతో.. రూ.5కోట్లతో ప్రాజెక్టు లోపల రింగ్ బండను నిర్మించిన ఇరిగేషన్ అధికారులు, అప్పటి నుంచి ప్రాజెక్టు మూడు గేట్లను పూర్తిగా ఎత్తేసి ఉంచారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తివేసి ఉండడంతో.. ఆదివారం రాత్రి 9గంటలకు పెదవాగులోకి 22 క్యూసెక్కుల నీరు చేరింది. వచ్చిన నీరు వచ్చినట్టే గేట్ల నుంచి బయటకు వెళ్లిపోయాయి. ప్రాజెక్టు లోపల నిర్మించిన రింగ్‌బండ్ సామర్థ్యం 3.5 మీటర్లు ఉండగా.. 2.5 మీటర్లను దాటి రింగ్‌బండలోకి నీరు చేరింది. మరి కొద్దిసేపు వరద కొనసాగితే రింగ్‌బండకు ప్రమాదం ఏర్పడి.. అందులో నీరంతా గ్రామాలు, పంట పొలాలపై పడే పరిస్థితి నెలకొంది. గతేడాది వరదను ఇంకా కళ్ల ముందు నుంచి మరచిపోలేని ఆయకట్టు గ్రామాలైన గుమ్మడపల్లి, కొత్తూరుతో పాటు ఏపీలోని కమ్మరిగూడెం, రాళ్ళవాగు, మేడేపల్లి, ఊటుగూడెం, అల్లూరి నగర్ తదితర గ్రామాల ప్రజలు ఆదివారం రాత్రి ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీశారు. చిమ్మ చీకటిలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. దీంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి ఆ గ్రామాలలో నెలకొంది. అప్పటికే ఆయా గ్రామాల పరిధిలోని పంట పొలాలలోకి నీరు చేరుకుంది. అటు ఏపీ, ఇటు తెలంగాణ అధికారులు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఏపీ ప్రభుత్వం ఎస్‌ఆర్‌డీపీ బృందాలను బోట్లు, గజ ఈతగాళ్లతో పాటు డ్రోన్‌లను పంపింది. ఇదే సమయంలో పోలీసులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో డీఆర్‌డీఎఫ్ బృందం, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలను హెచ్చరించడంతో పాటు రాత్రంతా ప్రాజెక్టు కట్టపైనా పహారా కాసారు. నిమిష నిమిషానికి నీటి ఇన్ ఫ్లో ఎంత వస్తుంది!?, అవుట్ ఫ్లో ఎంత వెళుతుందో అంచనా వేస్తూ ఉన్నతాధికారులకు సమాచారం పంపారు. అయితే ఆదివారం అర్ధరాత్రి ఒక్కసారిగా పై భాగంలో, స్థానికంగానూ వర్షం నిలిచిపోవడంతో.. కొన్ని గంటలపాటు నీటి నిల్వలు పెరగకుండా ఉండిపోయాయి. మరోవైపు.. మరో రెండు రోజులపాటు తుఫాన్ ఉందని హెచ్చరికల నేపథ్యంలో మళ్లీ వర్షం పడితే జరగరానిది ఏమైనా జరిగి పోతుందేమోనన్న భయాందోళనలో అటు అధికారులు, ఇటు స్థానికులు భయాందోళనలో కాలం వెల్లదీశారు.

క్షణమొక యుగంలా గడిపారు. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత వరద ప్రవాహం తగ్గుతుందని గమనించారు. పై ప్రాంతంలో (మిగతా 6వ పేజీలో)



రింగ్‌బండను ఆనుకొని ప్రవహించిన నీరు



పెదవాగు ప్రాజెక్టు గేట్ల నుంచి ఉధృతంగా బయటకు వెళుతున్న నీరు

గిరిజన చట్టాలను అమలు చేయాల్సిందే..

- పకడ్బందీగా అమలుకు ఐక్యంగా యుద్ధం చేద్దాం
- లంబాడీ సంఘాల జేఏసీ నాయకుల పిలుపు
- కొత్తగూడెం పట్టణంలో మహా ర్యాలీ
- అంబేద్కర్ విగ్రహానికి నాయకుల వినతి

6



లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డు వద్ద శాంతి మహా ర్యాలీలో గిరిజన సంఘ నాయకులు


మకాం మార్చని మెప్మా

- కేఎంసీలో రెండు జిల్లా స్థాయి కార్యాలయాలు
- వైరా, సత్తుపల్లి, కల్లూరు, మధిర మున్సిపాలిటీలపై తగ్గిన పర్యవేక్షణ
- సొంత భవనం వినియోగించక పోవడంతో శిథిలావస్థలోకి..
- సొంత భవనాల్లోకి వెళ్లాలని ఆదేశాలిచ్చిన కేఎంసీ కమిషనర్

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ శాఖల్లాగే సమీకృత కలెక్టరేట్, లేనిపక్షంలో ఖమ్మంలోని సొంత భవనం నుంచి పరిపాలన సాగిస్తూ పట్టణ పేదరిక నిర్మూలనకు పాటు పడాల్సిన మెప్మా జిల్లా కార్యాలయాలు ఖమ్మం నగర పాలక సంస్థలోనే కొన్నేళ్లుగా ఉంటున్నాయి. దీంతో ఖమ్మం మినహా ఇతర మున్సిపాలిటీలపై పర్యవేక్షణ తగ్గడంతో పాటు ఖమ్మం నడిబొడ్డున ఉన్న రూ.కోట్లు విలువ చేసే మెప్మా సొంత భవనం శిథిలావస్థకు చేరుతోంది. అయితే ఇప్పటికే సొంత భవనాలకు వెళ్లాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలు జారీ చేశారు. అయినా మెప్మా అధికారులు ఆ దిశగా కార్యాలయం మార్పుపై సుముఖత చూపక పోవడం గమనార్హం.

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో జిల్లా మిషన్ కో ఆర్డినేటర్, ప్రాజెక్టు డైరెక్టర్ రెండు కార్యాలయాలు జిల్లా స్థాయిలో కేటాయించబడ్డాయి. ఖమ్మం నగరంతో పాటు వైరా, మధిర, సత్తుపల్లి, కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీలను డీఎంసీ, ప్రాజెక్టు డైరెక్టర్ నిత్యం పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. వీరు జిల్లా కలెక్టర్, లేదా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పరిధిలో బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. డీఎంసీ, ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయాలు కూడా సెర్ప్ వలే జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఖమ్మం జిల్లాలో (మిగతా 8వ పేజీలో)

నిరుపయోగంగా
డబుల్ బెడ్‌రూం ఇళ్లు



▸ తమకు కేటాయించాలని నిరుపేదల వేడుకోలు

దుమ్ముగూడెం సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పేదలు తలదాచుకోడానికి గత ప్రభుత్వం రూ.కోట్లాదిల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన డబుల్ బెడ్‌రూం సముదాయాలు కొన్ని పూర్తి నిరుపయోగంగా మారాయి. పలు కారణాలతో తమకు కేటాయించిన గృహాల్లో ఉండేందుకు లబ్ధిదారులు అయిష్టత చూపుతుండగా, మొ క్కుబడిగా ఇంటికి తాళాలు వేసి ఖాళీగా ఉం చుతున్నారు. తాళాలు వేయని ఖాళీ గృహాల్లో ఉండేందుకు కొందరు గూడులేని స్థానిక పేద లు ప్రయత్నించగా నిబంధనల పేరిట అధికారులు వారిని ఖాళీ చేయించారు. లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులు డబుల్ గృహాల్లో నివాసం ఉండక, ఉంటున్న నిరుపేదలను ఖాళీ చేయించడంతో గౌరారం డబుల్ గృహ సముదాయం నిరుపయోగంగా తయారైంది. గౌరా రం డబుల్ ఇళ్లను దక్కించుకున్న వారిలో కొం దరికీ తాజాగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలుస్తోండగా, ఇకపై వాళ్లెవరూ డబుల్ గృహా ల్లో ఉండే అవకాశాలు లేవని సమాచారం. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారితో పాటు డబుల్ ఇళ్లలో నివాసానికి ఇష్టపడని వారిని గుర్తించి వారి ఇళ్లను క్యాన్సిల్ చేసి, అవసరమైన పేదలకు కేటాయిస్తే ప్రజాధనం ఒకింత సద్వినియోగమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మూడేళ్ల క్రితం గౌరారం గ్రామపంచాయతీలో రూ1.26 కోట్లతో 25 డబుల్ ఇళ్లను నిర్మించారు. ఆలస్యంగా విద్యుత్, నీటి సదుపాయా లు కల్పించారు. తలుపులు, బాత్‌రూంల నిర్మాణాలను మాత్రం అరకొరగా చేసి వదిలేశారు. గృహాల కేటాయింపు కోసం లింగాపురం, తాటివారిగూడెం, పైడాకులమడుగు, గౌరారం గ్రామాలకు చెందిన 25 కుటుంబాలను రెండేళ్ల క్రితం లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ప్రస్తు తం గౌరారం గ్రామానికి చెందిన కొందరు లబ్ధి దారులు మాత్రమే డబుల్ ఇళ్లలో నివసిస్తోండగా, దూర ప్రాంత లబ్ధిదారులెవరూ ఉండడం లేదు. ఇళ్లు లేని పదిమంది స్థానిక నిరుపేదలు ఖాళీగా ఉన్న కొన్ని డబుల్ గృహాల్లో నివా సం ఉండగా, నిబంధనల కారణంగా గత ఏడాది అధికారులు ఖాళీ చేయించారు. చాలా మంది లబ్ధిదారులు అధికారుల తనిఖీల సమయంలో మాత్రమే తమకు కేటాయించిన డబు ల్ ఇళ్లలో ఉంటూ, మిగతా కాలమంతా స్వగ్రామాల్లోని ఇళ్లలోనే ఉంటున్నారని తెలుస్తోంది.

అన్నీ ఖాళీగా ఉన్నాయి



● సున్నం ధనలక్ష్మి

గౌరారం డబుల్ బెడ్‌రూములన్నీ దాదాపుగా ఖాళీగా ఉన్నాయి. చుట్టు ప్రక్కల ఎవరూ లేకపోవడంతో నాకు కేటాయించిన ఇంట్లో ఉండటానికి కూడా భయం కలుగుతోంది. అధికారులు ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూములను గుర్తించి ఇళ్లు లేని వారికి కేటాయిస్తే బాగుంటుంది.

మాకు కేటాయిస్తే ఉంటాం!



● సోడె జయలక్ష్మి, గౌరారం

ఎవరూ నివాసం ఉండక పిచ్చిమొక్కలు, తుప్పలు లేచి గౌరారం డబుల్ గృహాలు బీటలు వారుతున్నాయి. ఖాళీగా ఉన్న ఇళ్లను ఇల్లులేని తమలాంటి వాళ్లకు కేటాయిస్తే నివాసం ఉంటాం. తనలాంటి ఇల్లులేని నిరుపేదలు చాలామంది స్థానికంగా ఉన్నారు. వారందర్నీ గుర్తించి ఇళ్లు కేటాయించాలి.

దాచుకున్నారు.. పోగొట్టుకున్నారు

▸ పతనమైన మక్కల ధర

▸ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని రైతుల వినతి

వైరా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో వచ్చిన మొక్కజొన్న దిగుబడులను అధిక ధరలు ఆశించి నిల్వ చేసిన రైతులకు ప్రస్తుతం తీవ్ర ధరాఘాతంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. భవిష్యత్‌లో అధిక ధర వస్తుందని ఆశించి దాచుకున్న మొక్కలకు ఇప్పుడు ధరలు దారుణంగా పడిపోవడంతో గతంలో వచ్చే రేటును కూడా పోగొట్టుకున్నా రు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో మొక్కజొన్నల ధర క్వింటా ఒక్కింటికి రూ.2,150 నుం చి రూ.2,200వరకు పలికింది. అయితే కొందరు రైతులు అదేవిధంగా వ్యాపారులు మొక్కజొన్న లు అమ్మకుండా మరింత ధర పెరిగిన తర్వాత అమ్ముకోవాలనే ఆశతో వాటిని నిల్వ ఉంచుకున్నారు. నెల కిందట క్వింటా ఒక్కింటికి రూ.2400నుంచి రూ.2500వరకు ధర పలికింది. అప్పుడు కొంతమంది మాత్రమే తమ నిల్వలను అమ్ముకున్నారు. ఇంకా ఎక్కువమంది రైతు లు, వ్యాపారుల వద్ద నిల్వలు భారీగా ఉన్నా యి. అయితే ఇప్పుడు మొక్కజొన్నల ధర రోజురోజుకు పతనమవుతుంది. క్వింటా ఒక్కింటికి రూ.2200కు పడిపోయింది. లారీకి ఎగుమతి భారాన్ని కూడా రైతులే భరించాలని వ్యాపారులు డిమాండ్ చేస్తుండటంతో గత్యంతరం లేక రైతులు తలొగ్గుతున్నారు. దాంతో క్వింటా ఒక్కింటికి రూ.2150మాత్రమే రైతులకు లభిస్తుంది. గత ఐదునెలల నుంచి మొక్కజొన్నలు దాచిన రైతులకు ధరాఘాతం తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. అంతేకాకుండా నిల్వ ఉన్న మొక్కజొన్నల తరుగుపోయాయి. ఖాళీ గన్నీసంచులు, హమాలీ, గోదాములకు మొక్కజొన్నల తోలకాలు, ఐదునెలల వడ్డీలు తదితర ఖర్చులన్నీ కలిపితే క్వింటాకు రూ.రెండువేలు లభించడం లేదు. రైతుల పరిస్థితి ఇలా ఉంటే మొక్కజొన్నలు వేలాది మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి నిల్వ చేసిన కంపెనీలు, వ్యాపారుల పరిస్థితి కూడా మరింత దారుణంగా ఉంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన మొక్కజొన్న పంట కూడా రైతు చేతికి వస్తుంది. ఇటీవల కేంద్రప్రభుత్వం మొక్కజొన్నలు క్వింటా ఒక్కింటికి రూ.2400 మద్దతు ధర ప్రకటించింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లయితే ఇప్పుడు వస్తున్న దిగుబడులతోపాటు పాత నిల్వలను కూడా అమ్ముకొని కొంతమేర నష్టాల బారీ నుంచి బయటపడతామని రైతులు ఆశిస్తున్నారు. అందువలన ప్రభుత్వం మద్దతు ధరకు మొక్కజొన్నలు కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని మొక్కజొన్న రైతులు కోరుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

▸ ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగా వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న వంగా వెంకట్

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం మొండికేస్తే అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని సమ్మె చేపడతామని, యాజమాన్యాన్ని, కార్మికులను సర్కార్ సంఘమే తప్పదోవపట్టాస్తుందని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగా వెంకట్, సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.వీరస్వాములు అన్నారు. ఆదివారం శేషగిరిభవన్‌లో ఏర్పాటుచేసిన ఏఐటీయూసీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ గెలిచిన తర్వాత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయడం కోసం యాజమాన్యానికి లేకలు రాయడం జరిగిందని, వాటిపై ఇప్పటివరకు రెండుసార్లు డైరెక్టర్ ఫా స్థాయి, ఒకసారి సీఎండీ స్థాయిలో స్ట్రక్చర్ సమావేశాలు జరిగాయని, వాటిలో కొన్ని సమస్యలను అంగీకరించిన యాజమాన్యం ఇప్పటివరకు సర్క్యులర్లను జారీ చేయలేదన్నారు. సమస్యలు పరిష్కారం కాలేదని కొన్ని కార్మిక సంఘాలు ఏఐటీయూసీపై విమర్శలు చేస్తూ కార్మికులను తప్పదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సమస్యలపై సర్క్యులర్‌లు జారీ చేయకపోవడంతోనే స్ట్రక్చర్ కమిటీ సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిపారు. కార్మికుల అండ తో పోరాటాలు చేసి ఎన్నో హక్కులు సాధించిన ఘనత ఏఐటీయూసీ దని అన్నారు. ఈ సమావేశంలో ఎస్వీ రమణమూర్తి, ఘట్టయ్య, రాము, క్రిష్టాఫర్, నాగయ్య, శ్రీను, మల్లయ్య, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాడు ఫల రాజు.. నేడు నష్టాల రాజు

▸ నష్టాలు భరించలేక తోటలను నరికివేస్తున్న మామిడి రైతులు



తరలించేందుకు సిద్ధంగా మామిడికర్ర

పెనుబల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు గతంలో ఎంతో ప్రాముఖ్యత సంచరించుకున్న ఈ ప్రాంతంలో నేడు మామిడి పంట దీనాతిదీనస్థికి చేరడంతో ఎంతో అపురూపంగా పెంచుకున్న తోటలను నేడు రైతులు నరికివేస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి మామిడిపంటను దేశవిదేశాల్లో తరలించి విక్రయించిన పరిస్థితుల నుంచి ప్రస్తు తం పంట చేతికి రావడమే ఖరాకష్టంగా ఉండగా వచ్చిన పంట మార్కెట్లో ధర లేక వెలవెలబోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పెనుబల్లి పరిసర మండలాల్లోని రైతులు సాగుచేసిన మామిడిపంటను పెనుబల్లిలో ఏర్పాటుచేసిన మార్కెట్‌కు తరలించి హైదరాబాద్, నాగపూర్, ముంబై, కలకత్తా లాంటి తదితర ప్రాంతాలకు తరలించేవారు. ఆపరిస్థితుల్లో మామిడి సాగుచేసిన రైతులతోపాటు కూలీలకు, వ్యాపారులకు, రవాణాదారులకు ఇలా అన్నివర్గాలకు లాభదాయకంగా ఉండే ది. ప్రస్తుతం సాగులో మార్పులు రావడంతో అనేకసార్లు మందులు పిచికారి చేయాల్సి రావడం దీంతో అధిక పెట్టుబడులను పెట్టాల్సి వస్తుంది. పెట్టుబడులు అధికంగా పెట్టిన రైతులకు అదేస్థాయిలో రాబడి ఉండటం లేదు. పంట కూడా గతంలో ఈ ప్రాంతంలోని కాయలకు ఇతర ప్రాంతాల్లో చాలా డిమాండ్ ఉండేది. దీంతోపాటుగా మరో వాణిజ్య పంట అయిన పామాయిల్‌కు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుండటంతో రైతులు పామాయిల్ సాగుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. గతంలో వేలాది హెక్టార్లలో ఉన్న మామిడి సాగు ప్రస్తుతం వందల ఎకరాల్లో కూడా లేదంటే మామిడి సాగు ఈ ప్రాంతంలో ఏ పరిస్థితిలో ఉందో అర్థమవుతుంది. ఈ పరిస్థితుల్లో మామిడికి గత వైభవం ఎప్పుడు సంతరించుకుంటుందోనని రైతు ఆశాభావం వ్యక్తం చేస్తూనూ నిరాశ నిస్పృహల మధ్య మామిడితోటలను తొలగిస్తున్నారు.

పంచాక్షరయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో కవి, గాయక సమ్మేళనం



కవి మాల్యశ్రీని సన్మానిస్తున్న దృశ్యం

బూర్గంపాడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో ఆదివారం తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'భారతి విజయం' పేరుతో కవి గాయక సమ్మేళనం, కవి మాల్యశ్రీకి ఆత్మీయ సత్కారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ ఛైర్మన్ పంచాక్షరయ్య మాట్లాడుతూ తెలుగు భాషా, సాహిత్యాలు సుసంపన్నమైన, సుందరమైనవి అని అన్నారు. ఇటువంటి మహోన్నతమైన జాతి సంపద అయిన భాష సాహిత్యాన్ని భావితరాలకు అందిచాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో కవి మాల్యశ్రీతో పాటు 15మంది కవి గాయకులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, శతక కవి చిగురుమళ్ల శ్రీనివాస్, సొసైటీ ఛైర్మన్ భిక్కసాని శ్రీనివాసరావు, తిప్పన సిద్ధులు, దేశప్ప, సూర్యనారాయణ, సీవీకే రమణ, వెంకట్రావు, లలిత, దుర్గాచారి, తదితరులు పాల్గొన్నారు.

భయం గుప్పిట్లో..



ఆదివారం రాత్రంత పహారాకాసిన ఇరిగేషన్ సిబ్బంది

(5వ పేజీ తరువాయి)

వర్షం రాకపోవడంతో.. హమ్మయ్య అంటూ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అర్ధరాత్రి తర్వాత ప్రాజెక్టులోకి వచ్చి చేరిన నీరంతా బయటకు వెళ్లిపోయింది. ఇన్‌ఫ్లో బాగా తగ్గింది. తెల్లవారేసరికి ప్రాజెక్టులో నీరు పూర్తిగా తగ్గిపోయింది. సోమవారం కూడా వర్షం పడకపోవడంతో.. పెద్ద ప్రమాదం తప్పిందని అటు అధికారులు, ఇటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. 16000 ఎకరాల ఆయకట్టు కలిగిన పెదవాగు ప్రాజెక్టు ఏపీ, తెలంగాణ ప్రాంతాలలో విస్తరించి ఉంది. గత ఏడాది కట్ట తెగిన తర్వాత ప్రాజెక్టు పునర్నిర్మిణానికి రూ.90కోట్లకు పైగా ఖర్చు అవుతుందని.. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు కేటాయించి కట్ట సామర్థ్యాన్ని పెంచి పునర్నిర్మిస్తామని ప్రకటించాయి. తాత్కాలికంగా రూ.5కోట్లతో రింగ్ బండను నిర్మించి కొంతమేర పంటలకు ఆసరా కల్పించాయి. కనీసం ఈ ఏడాదైనా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకొని ప్రాజెక్టు పునర్నిర్మాణం చేపట్టకపోతే ప్రతీ ఏటా వర్షాకాలం వచ్చిందంటే ఆయా గ్రామాలకు ముప్పు తప్పదు. ఈ నేపథ్యంలో రెండు ప్రభుత్వాలు తక్షణమే ప్రాజెక్టు పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గత ఏడాది కోట్లాది రూపాయల విలువ చేసే పంట, ఇళ్లతో పాటు పొలాల్లో ఇసుక మేటలు వేసి తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్ముందు ఏవైనా విపత్తు జరిగితే మళ్లీ అంత నష్టం జరిగే తట్టుకునే శక్తి తమకు లేదని.. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు తమ గోడును అర్థం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గిరిజన చట్టాలను అమలు చేయాల్సిందే

▸ పకడ్బందీగా అమలుకు ఐక్యంగా యుద్ధం చేద్దాం

▸ లంబాడీ సంఘాల జేఏసీ నాయకుల పిలుపు

▸ కొత్తగూడెం పట్టణంలో మహా ర్యాలీ

▸ అంబేద్కర్ విగ్రహానికి నాయకుల వినతి పత్రం

▸ ఎస్టీ జాబితా నుంచి తొలగించడం ఎవరితరం కాదని ఉద్ఘాటన



కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న లంబాడీలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు కోసం ఐక్యంగా కలిసి యుద్ధం చేద్దామని లంబాడీ సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని కొత్తగూడెం వ్యవసాయ మార్కె ట్ కమిటీ నుంచి పోస్ట్ ఆఫీస్ సెంటర్ వరకు మహాశాంతి ర్యాలీని నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం జేఏసీ నాయకులు భూక్యా రమేష్, లావుడ్యా ప్రసాద్ నాయక్, గుగులోత్ రాజేష్‌నాయక్, డాక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడారు. ఎస్టీ జాబితానుంచి లంబాడీలను తొలగించడం ఎవరి తరం కాదని, లంబాడీల ఆత్మగౌరవం దెబ్బతీస్తే సహించేదిలేదన్నారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఓటమి తేటతెల్లం అయ్యిందని తెలిసి అన్నదమ్ముల కలిసి మెలిసి ఉన్న గిరిజన తెగల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ ప్రయోజనం పొందాలనుకోవడం సరికాదని మండిపడ్డారు. తెల్లం, సోయం బాబూరావుకి వెనక ఉండి నడిపించే అదృశ్య శక్తులు ఎవరో లంబాడీ సమాజానికి తెలుసునని, వారిని వెంటాడి మరీ ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని అన్నారు. లంబాడీలపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొడుతూ నినాదాలతో హోరెత్తించారు. లంబాడీలు బ్రిటీష్, నిజాంకాలం నుండే ఎస్టీలుగా గుర్తించబడ్డారని, కొత్తగా లంబాడీలు ఎస్టీ కాదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. భారత రాజ్యాంగం అమలులో వచ్చిన రోజునే ఆర్టికల్ 342 ప్రకారం ఆంధ్ర, రాయలసీమ ప్రాంత సుగాలిలు ఎస్టీలుగా ఉన్నారని పేర్కొన్నారు. మాజీ ప్రధానీ మంత్రి దివంగత ఇందిర గాంధీ కాంగ్రెస్ హయాంలో సుగాలి, లంబాడీ, బంజారాలు ఒక్కటేనని గుర్తించి 1976 ఏరియా రిమూవల్ రెస్ట్రిక్షన్ యాక్ట్ ద్వారా లంబాడీలను ఎస్టీలుగా గుర్తించి ఎస్టీ రిజర్వేషన్ ఫలాలు ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతం నిజాం పాలనలో ఉన్న కారణంగా 1950 నుండి 1976 వరకు సుమారు 26 సంవత్సరాలు తెలంగాణ లంబాడీలు ఎస్టీ రిజర్వేషన్ ఫలాలు పొందలేక పోయామని వాపోయారు. ఈ ర్యాలీకి జిల్లా నలుమూలల నుండి వేలాదిగా తరలి వచ్చిన లంబాడీలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేంచంద్‌నాయక్, స్వరాజ్‌నాయక్, హుస్సేన్‌నాయక్, సంజీవ్‌నాయక్, డాక్టర్ రాజ్‌కుమార్, వీరునాయక్, డాక్టర్ వెంకన్న, లాల్సింగ్‌నాయక్, కిషన్‌నాయక్, కాన్షీరాం, రాములు, హత్తీరామ్, రవి రాథోడ్, లాలునాయక్, హుస్సేన్‌నాయక్, కిషోర్‌సింగ్, లాలూనాయక్, బాలు, రాంజీ, శోభన్, జుంకీలాల్, రవి, శంకర్‌నాయక్, ఈర్య, పూల్సింగ్, వీరన్న, నాగరాజు, కిషన్‌నాయక్, గణేష్, రాచందర్‌నాయక్, జనార్ధన్‌నాయక్, మంగీలాల్, కేశవ, గద్దం శ్రీను, శ్రీను, రాంబాబునాయక్, దేవీలాల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరు కాకుంటే
చర్యలు తప్పవు

(5వ పేజీ తరువాయి)

అంతరాయం కలుగుతుంది. ఆర్టీసీ సేవలపై ఆధారపడిన ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా గణనీయమైన నష్టం సంస్థకు కలుగుతోంది.. తక్షణమే మీకు కేటాయించిన విధులకు హాజరు కావాలని కోరుతున్నాం. లేదంటే తదుపరి చర్యలకు ఉపక్రమిస్తాం' అంటూ భద్రాచలంలో ఆర్టీసీ టిమ్స్ డ్రైవర్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఆర్టీసీ అధికారుల నుంచి మెసేజ్‌లు వస్తున్నాయి. దీంతో వారు ప్రతీరోజు తాము డ్యూటీకీ రావడం జరుగుతోందని, కండక్టర్‌ను ఇస్తే డ్యూటీకి వెళ్తామని ఇప్పటికే అధికారులకు విన్నవించి చెప్పామని సమాధానం ఇచ్చినట్లు సమాచారం. అయితే మెసెజ్‌లు ఈవిధంగా పంపి ఉద్యోగులపై అధికారులు ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఆర్టీసీ ఉద్యోగులు భోజనశాల, విశ్రాంతి గదుల వద్ద ఉంటుండగా.. రెండు రోజుల క్రితం అధికారులు వారిని బయటకు పంపడం పట్ల వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. దీంతో బస్టాండ్ బయట చెట్ల కిందే వారు ఉదయం నుంచి రాత్రి వరకు అధికారుల సమాచారం కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

టైరు పంచరైనా ఇంక్రిమెంట్ కట్(ట)....!

ఆర్టీసీ బస్సు టైరు పంచరైందంటే సంబంధిత డ్రైవరు ఇంక్రిమెంట్ కట్ అవుతోందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ నిర్లక్ష్యం లేకుండా ఎదుటివారి వల్ల బస్సు ప్రమాదం జరిగితే.. వారి వద్ద నష్టం రికవరీ చేయడమే కాకుండా తమ మీద శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నారని వారు వాపోతున్నారు. భద్రాచలం నుంచి వైజాగ్‌కు 420 కి.మీ. దూరం ఉండగా.. ఒకే డ్రైవరుతో బస్సు నడుపుతున్నారని, అదే ఖమ్మం నుంచి వైజాగ్‌కు 429 కి.మీ. ఉండగా.. ఇద్దరు డ్రైవర్లను అక్కడి డిపో అధికారులు ఇస్తున్నారని వారు పేర్కొంటున్నారు. మణుగూరు ఉంచి హైదరాబాద్‌కు రాను పోను 671 కి.మీ. ఉండగా.. మూడు మస్టర్లు ఇస్తున్నారని, కానీ భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు 624 కి.మీ.కు రెండు మస్టర్లు ఇస్తున్నారని.. అదేవిధంగా సత్తుపల్లి జీడిమెట్ల సర్వీసుకు సైతం 613 కి.మీ. మూడు రోజులు మస్టర్లు ఇస్తున్నారని వారు చెబుతున్నారు. ఒకే రీజియన్‌లోని వివిధ డిపోల మధ్య ఈ వ్యత్యాసం ఉండటం వల్ల డ్రైవర్లమైన తాము తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నామని వాపోతున్నారు. అంతేకాదు ఆరోగ్యపరంగా సైతం తమపై ఇది ఎంతో ప్రభావం చూపుతోందని, కనీసం ఇకనైనా అధికారులు మానవీయ కోణంలో తమ సమస్యను గుర్తించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఏదీ సమీక్ష ?

(5వ పేజీ తరువాయి)

ముందస్తుగా సమీక్ష ఏర్పాటు చేసి పుష్కరాలకు ఏ ఏ ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు!? ప్రతీరోజు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఆర్‌అండ్‌బీ రహదారులు ఉమ్మడి జిల్లాకు విస్తరణ చేయడం, ప్రధాన రహదారులకు అనుసంధానంగా ట్రాఫిక్‌జాం అయితే ఇతర రహదారుల నుంచి వాహనాలు పంపేందుకు వాటిని గుర్తించి కల్వర్టులు, బ్రిడ్జిలను, అప్రోచ్‌లను విస్తరింప చేయడం, ఏఏ గ్రామాల్లో స్నానాల ఘాట్లు అవసరం ఉందో గుర్తించి వాటికి ప్రణాళిక చేయాలి. ప్రతీరోజు లక్షల సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఇప్పటినుంచి కార్యాచరణ చేపడితేనే పనులు ఆసమయానికి పూర్తయ్యే అవకాశం ఉంటుంది. ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన సమీక్ష నిర్వహించడం, ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం, టెండర్లు చేపట్టడానికే సుమారు ఏడాది కాలం పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాత పనులు చేపట్టే సమయానికి పుష్కరాలు తరుముకొస్తే కాంట్రాక్టర్లు తూ తూ మంత్రంగా పనులు చేసి నిధులు దుర్వినియోగం చేసిన సంఘటనలు గతంలో ఉన్నాయి. ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాతో పాటు హైదరాబాద్, వరంగల్, విజయవాడ వైపుగా రహదారులు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. రాబోయే పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ఖమ్మం-దేవరపల్లి, కొత్తగూడెం-హైదరాబాద్ జాతీయ రహదారుల పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. ఖమ్మం-కొరివి, ఖమ్మం-వరంగల్ పనులు చేపట్టాలి. అలాగే బోనకల్-కొత్తగూడెం తదితర రోడ్లను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. భద్రాచలం ఆలయ అభివృద్ధికి రూ.320కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు ఈ నిధులతో పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

పర్ణశాలలో నేడు కృష్ణాష్టమి వేడుకలు

దుమ్ముగూడెం సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):భద్రాచల శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయంలో సోమవారం శ్రీవైష్ణవ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ ఇంచార్జి అనీల్‌కుమార్ తెలిపారు. శ్రీ కృష్ణ అవతారోత్స వం, ప్రత్యేక లాలలు జోలలు, ప్రసాద నివేదనలుంటాయన్నారు. 16న ఊట్ల పండుగ అనంతరం స్వామి వారి తిరువీధి సేవ ఉంటుందన్నారు.

వంతెన నిర్మాణం పూర్తయ్యేదెన్నడూ?

▸ 'సామర్థ్యంలేని కాంట్రాక్టరుకు అప్పగింతతో నిలచిపోయిన వంతెన నిర్మాణం'

▸ పదినెలల క్రితం రూ.3.65కోట్ల నిధులతో మంజూరైన వంతెన

▸ నవంబరునాటికి ప్రారంభించకపోతే కాంట్రాక్టు రద్దుచేస్తామంటున్న అధికారులు

▸ వర్షం వస్తే రాకపోకలకు ఆటంకం

అశ్వారావుపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా స్థోమత లేని కాంట్రాక్టరుకు అప్పగింతతో అశ్వారావుపేట మండలంలోని ఓ వంతెన పది నెలలు గడిచిన ప్రారంభించని పరిస్థితి ఏర్పడింది. వంతెన నిర్మాణంతో తమ గ్రామాలకు మహర్దశ ఏర్పడుతుందనే పరిసరాలలోని గ్రామాల ప్రజలు అడియాసలుగానే మిగిలిపోయాయి. వివరాలలోకి వెళితే ఇలా ఉన్నాయి. అశ్వారావుపేట మండలంలోని ఊట్లపల్లి-మద్దికొండ రోడ్డుపైన 1/100కి.మీ వద్ద కేశప్పగూడెం సమీపంలో వంతెన నిర్మాణానికి ఐటీడీఏ -పీఎంజీఎస్‌వై నిధులు రూ.3.65కోట్లు కేటాయించి రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా. గత డిసెంబరు 26న శంకుస్థాపన చేశారు. ఈ పనులను గత మార్చిలో పాల్వంచకు చెందిన ఓ కాంట్రాక్టర్ టెండర్‌లో దక్కించుకొని అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ వంతెనకు శంకుస్థాపన చేసి ఇప్పటికి 10 నెలలు పూర్తి అయ్యింది. కాని ఇప్పటి వరకు సదరు కాంట్రాక్టర్‌తో పనులు ప్రారంభింపజేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఈ వంతెన నిర్మాణం తో కేశప్పగూడెం, ఊట్లపల్లి, రాజాపురం, జమ్మిగూడెం ప్రాంతాలలోని రైతులు గుర్రాలచెరువు, మొద్దులగూడెం, అల్లాడి వారి మకాం గ్రామాలకు, పరిసరాలలోని పంట పొలాలలోకి రాకపోకలు, పంటలు రవాణా చేసేందుకు ఎం తో వీలుంటుందని ఆ ప్రాంత వాసులు భావించారు. వర్షాకాలం వచ్చిందంటే ఈ వంతెనను ప్రతిపాదించిన ప్రాంతంలో రోడ్డుపై నుంచివాటు ప్రవహించి పెద్ద ఎత్తున బురద ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుంది. కనీసం ద్విచక్రవాహనం కూడ నడిచే పరిస్థితి ఉండదు. ఇక్కడ వంతెనను మంజూరి చేయడంతో ఆ ఇబ్బందులు తప్పుతాయని ప్రజలు బావించారు. కాని ఈ రోజు వరకు వంతెన పనులను ప్రారంభించకపోవడంతో ప్రజలు ఆశలు ఆవిరయ్యాయి. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ నేటికి పనులు ప్రారంభించకపోయిన అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఒకే దపా రెండు వంతెనలు దక్కించుకోవడంతోనే పనుల్లో ఆలస్యం: పీఆర్ ఏఈఈ అక్షిత..

కాంట్రాక్టరుకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. ఈ వంతెన పనులను పాల్వంచకు చెందిన ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నారని, ఈయన ఈ వంతెనతో పాటు జిల్లాలో మరో వంతెనను దక్కించుకున్నారని, ఈ రెండు వంతెనలు ఒకేసారి చేయలేనని, మొదటి వంతెన నిర్మాణం పూర్తి అయిన తరువాత ప్రారంభిస్తామని చెపుతున్నట్టు ఆమె తెలిపారు. కాంట్రాక్టు అగ్రిమెంట్ కూడ నవంబర్ వరకు ఉందని, త్వరగ ప్రారంభించాలని మరోసారి నోటీసు ఇచ్చామన్నారు. వచ్చే నెలలో నే వంతెన పనులను ప్రారంభిస్తామని కాంట్రాక్టరు చెపుతున్నారని, నవంబరు కల్లా ప్రారంభించకపోతే కాంట్రాక్టరు పేరు బ్లాక్ లిస్ట్‌లో పెట్టి రద్దు చేస్తామని, మరలా టెండర్ పిలుస్తామని ఆమె తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

» తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు

గుండాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత ఏర్పడిందని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు సకాలంలో యూరియా అందించకుండా కృత్రిమ కొరతను సృష్టిస్తుందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారని తెలిపారు. అదును దాటిపోతుండటంతో రైతులు రోజుల తరబడి పంపిణీ కేంద్రాల వద్ద క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తుదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపి నాయకులు ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతుల కష్టాలు చూడాలని కోరారు. యూరియా కొరతతో పంటల ఉత్పత్తి ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి యూరియా సరఫరా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న శంకర్‌రావు

భద్రాద్రి రామునికి ప్రత్యేక పూజలు

» స్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్


రామాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

భద్రాచలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఆదివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి రాణి కుముదిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అలాగే రామాలయంలో ఆదివారంను పురస్కరించుకొని అంతరాలయంలో ఆర్జిత సేవలో భాగంగా స్వామి వారికి అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అలాగే స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

పచ్చని పొలాల్లో
ఇసుక మేటలు

» అశ్వారావుపేటలో తగ్గని వరదనీటి ప్రవాహం
» అలుగులు పారుతున్న చెరువులు
» దెబ్బతిన్న వేరుశనగ పంట
» రూ.లక్షల్లో నష్టం

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలో శనివారం వచ్చిన భారీ వర్ష ప్రభావం ఆదివారం కూడా కనిపించింది. అశ్వారావుపేటలో వర్షపాతం 55 మిల్లీమీటర్లు నమోదు అయినా గ్రామీణ ప్రాంతాల్లో అంతకు మూడు రెట్లు అధికంగా వర్షం పడింది. మండలంలోని దబ్బతోగు, పండువారిగూడెం, అనంతారం ప్రాంతాల్లో పడిన భారీ వర్ష నష్టం ఆదివారం బయట పడింది. అన్నదాతలు ఉదయం పొలాలకు వెళితే పంటలు కొట్టుకుపోయి కనిపించడంతో లబోదిబోమన్నారు. పండువారిగూడెం, అనంతారం, మల్లాయిగూడెం ప్రాంతాల్లో వేరుశనగకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. కొందరు నాలుగైదు రోజుల క్రితమే వేరుశనగను వేశారు. ఈనేపథ్యంలో వచ్చిన అకాల వర్షానికి పంట కొట్టుకుపోయింది. పలువురు రైతులకు చెందిన పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. వాగుల వెంట వరదకు పంటలు దెబ్బతిన్నాయి. పండువారిగూడెంలో రాజు అనే రైతుకు చెందిన 20 ఎకరాల్లో వేసిన వేరుశనగ పూర్తిగా కొట్టుకుపోగా దాదాపు రూ.10లక్షల మేర నష్టం వాటిల్లింది. అనేక గ్రామాల్లో గల ఇంకా పొంగి ప్రవహిస్తూనే ఉన్నాయి. వాగొడ్డుగూడెం వాగు పొంగి ప్రవహిస్తుండటంతో అనంతారం మార్గంలో రెండో రోజు రాకపోకలు నిలిచిపోయాయి. అచ్యుతాపురం, నారంవారిగూడెం, ఊట్లపల్లి, కన్నాయిగూడెం, అనంతారం, గాండ్లగూడెం ఇలా అనేక గ్రామాల్లో గల చెరువుల అలుగులు ఉధృతంగా పారుతూనే ఉన్నాయి.


అలుగు పారుతున్న అచ్యుతాపురం సమీపంలోని చెరువు


పండువారిగూడెంలో వరద ధాటికి కొట్టుకుపోయిన వేరుశనగ

భీమునిగుండం కట్టకు బుంగ



అశ్వాపురం: మండలంలోని సాగునీటివనరు తుమ్మలచెరువుకు దిగువన ఉన్న భీమునిగుండానికి ముప్పు పొంచి ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుమ్మలచెరువు షెట్టర్లు మరమ్మతులకు గురికావటంతో పొలాలు ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన నేపథ్యంలో శనివారం ఆయకట్టు రైతులు పట్టుదలతో తూములు తెరిచిన సంగతి తెలిసిందే. తూమునుంచి నీటిప్రవాహం అధికంగా విడుదలవుతుండటంతో భీమునిగుండం సమీపంలోని తుమ్మలచెరువు ప్రధాన కాలువ కుందారం కాలువలో నీరు పట్టక కట్టపై నుంచి ప్రవహిస్తునాయి. దీంతోపాటు గుండం ప్రధాన కట్టకు ఆదివారం భారీ గండిపడింది. ఇంకా నీటిప్రవాహన్ని తగ్గించకపోతే కట్టతెగే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. మరోవైపు భీమునిగుండం కూడా పూర్తిగా నిండిపోయింది. భారీ వర్షం పడితే భీమునిగుండం కట్ట పూర్తిగా తెగిపోయి వందలాది ఎకరాల్లో వరిపంటకు తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు కుందారం కాలువకూడా తెగిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో అప్రమత్తమయిన ఆయకట్టు రైతులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోక పోవడంతో రైతులే యుద్ధప్రాతిపదికన గుండం కట్ట తెగకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అధికారుల స్పందించి తుమ్మలచెరువు తూము నుంచి నీటిప్రవాహన్ని తగ్గించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.నుంచి నీటిప్రవాహన్ని తగ్గించుకుంటేనే గండం గట్టెక్కే పరిస్థితి ఉంది.

కార్పొరేటర్ కుమారుడిపై కేసు నమోదు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం 1వ డివిజన్ కార్పొరేటర్ కుమారునిపై ఖమ్మం ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం 1వ డివిజన్ కార్పొరేటర్ కుమారుడు తేజావత్ వినోద్ కైకొండాయిగూడేనికి చెందిన స్పందన అను యువతిని కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఈ నెల 13న సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంటి పక్కన ఉండే సదరు యువతి అత్త జ్యోతితో మాట్లాడుతుండగా అక్కడికి వచ్చిన వినోద్ తనతో పాటు తెచ్చుకున్న కొడవలితో సదరు యువతి చేయి పట్టుకొని గొంతుకోసి చంపుతానని బెదిరించాడు. అదేవిధంగా వినోద్ భార్య సుజాతతో పాటు తల్లి మంగమ్మ, తండ్రి హుస్సేన్‌లు తాము కార్పొరేటర్లమని ఏమి చేయలేరని బెదిరించాడు. దీంతో బాధితురాలు ఖానాపురంహవేలి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా పిల్లల ఉన్నత చదువుకు అవకాశం కల్పించండి

» విద్యార్థుల తల్లిదండ్రుల వేడుకోలు

పాల్వంచ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్-33తో మా పిల్లలకు తీవ్ర అన్యాయం జరిగిందని, 2025-26 నీట్ కౌన్సిలింగ్ నందు తెలంగాణ ఫైనల్ మెరిట్ లిస్టులో మా పిల్లల పేర్లను చేర్చి మా పిల్లల ఉన్నత చదువులకు అవకాశం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్ నందు ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మా పిల్లలు తెలంగాణ వాసులైనప్పటికీ ప్రక్క రాష్ట్రం ఏపీలో ఇంటర్మీడియేట్ చదువుకున్నంత మాత్రాన జీవో నెంబర్ 33 ద్వారా లోకల్ అర్హత కోల్పోవడం అన్యాయమన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నీట్ పరీక్షలు మే-24-25లో రాసి ఉత్తీర్ణత సాధించి అర్హత పొందామని తెలిపారు. ప్రభుత్వం ఈ జీవో జారీ చేయడానికి ముందే తాము ఇంటర్మీడియట్ పూర్తి చేయడం జరిగిందని, నీట్ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించినప్పటికీ ఈ జీవో మా భవిష్యత్‌కు అడ్డంకిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను లోకల్‌గా పరిగణించాలని వేడుకున్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎలవర్తి రవీంద్రబాబు, ఎండీ ఫహీం, హైమావతి, శివలక్ష్మి, శ్రీనివాసరావు, కృష్ణ, ప్రసాద్, లక్ష్మి, విద్యార్థులు శ్రీవైభ, శ్రీసత్యవతి, సన్విత్తాగాయత్రి, హర్షిత, రోషిణి, వశిష్ఠ, మానస, మినీష, నమతాశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి తల్లి లక్ష్మి

జియోథర్మల్ ప్రాజెక్టును పరిశీలించిన సింగరేణి డైరెక్టర్ పీఅండ్‌పీ

మణుగూరు. సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండల పరిధిలోని పగిడేరు పంచాయతీలో గల జియోథర్మల్ ప్రాజెక్టును సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. జియోథర్మల్ ప్లాంట్‌ను పరిశీలించిన అనంతరం ప్రస్తుత ఉత్పత్తి సామర్థ్యం 20 కిలో వాట్స్ కంటే ఉత్పత్తిని పెంపునకు అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఆ తర్వాత ఏరియాలో పికే ఓసీ-2 గనిని వ్యూపాయింట్ ద్వారా పరిశీలించారు. క్వారీల్లోకి చేరిన నీటిని బయటికి పంపే చర్యలను ముమ్మరం చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ సునీల్‌కుమార్, జనరల్ మేనేజర్ ఎస్ ఎస్ మాయల్, కిరణ్, మణుగూరు ఏరియా జీఎం రామచందర్, జీఎం ఆర్ అండ్‌డీ కనకయ్య, జీఎం ఎక్స్‌ప్లోరేషన్ శ్రీనివాస్, ఏజీఎం పంకజ్, డీజీఎం రాజ్‌కుమర్, డీజెం ఆర్‌అండ్‌డీ శ్రీనివాస్ ఏరియా ఇంజనీర్ శ్రీనివాస్, ప్రాజెక్టు ఇన్‌చార్జి వీరభద్రరావు, ఎస్‌వోటూ జీఎం శ్రీనివాసచారి పాల్గొన్నారు.


జియోథర్మల్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న దృశ్యం

భాగవత సప్తాహం ఈసారి లేనట్లేనా?

భద్రాచలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహం ఈసారి లేదా అని రామ భక్తులు పేర్కొంటున్నారు. గత తొమ్మిదేళ్లుగా దేవస్థానంకు చెందిన వైదిక సిబ్బంది శ్రీమద్భాగవత సప్తాహాన్ని ఎంతో భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ప్రతిసారి శ్రావణమాసం లేదా భాద్రపద మాసంలో కృష్ణపక్షంలో పంచమి నుంచి ద్వాదశి వరకు నిర్వహించేవారు. ఈ సమయంలో శ్రీమద్భాగవత పారాయణం చేసే ముందు అంకురారోపణం, మండపారాదన, శ్రీమద్భాగవత మహత్య ప్రవచంను నిర్వహించేవారు. అలాగే అగ్ని ప్రతిష్ఠ, వేద విన్నపాలు, గోపూజ నిర్వహించి 12 స్కందాల పారాయణం పూర్తయిన అనంతరం మహా పూర్ణాహూతి వేద విన్నపాలు నిర్వహించేవారు. అనంతరం సాయంత్రం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి సప్తాహ ప్రయుక్త శాంతి కల్యాణోత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించే వారు. ఈసారి ఈ కార్యక్రమం నిర్వహించకపోవడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. ఎంతో భక్తిప్రపత్తులతో నిర్వహించే ఈ కార్యక్రమం ఎందుకు నిర్వహించడంలేదో తెలియడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం రామక్షేత్రం అయినప్పటికీ నిత్యం రామాయణపారాయణం జరుగుతూ ఉంటుంది. కాని భాగవత సప్తాహం అనేది పారాయణ హవనం, ప్రవచనం అనేవి చాలా ప్రత్యేకమైనవని ఇది జరగడం చాలా విశేషమని వైదిక పెద్దలు పేర్కొనేవారు.

శతాధిక వృద్ధురాలి మృతి


రంగమ్మ(ఫైల్)

కామేపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల కేంద్రానికి చెందిన శాతధిక వృద్ధురాలు గొట్టుపర్తి రంగమ్మ(101) శనివారం మృతి చెందింది. గత కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుంది. గతంలో కామేపల్లిలో జరిగిన దోసపండు యాగం కార్యక్రమంలో ముఖ్య భూమిక పోషించింది. ఆమెకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అవధూతేంద్ర భక్తమండలి అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ, నాగభూషణం నివాళులర్పించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులపై ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్ నందు ఆదివారం రాత్రి కేసునమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బైపాస్‌రోడ్, కొత్త బస్టాండ్ సమీపంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో గుంటూరుకు చెందిన వ్యక్తితో పాటు, ఖమ్మంకు చెందిన మరో ఆరుగురు పట్టుబడ్డారు. వారివద్ద నుంచి రూ.45వేల స్వాధీనం చేసుకొని, వారిపై టూటౌన్ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

విత్తనం నుంచి మహావృక్షంగా
వనజీవి జీవితం పుస్తకావిష్కరణ

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వనజీవి రామయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని కాళోజీ అవార్డ్ గ్రహీత ప్రముఖ కవి సీతారాం అన్నారు. ఖమ్మం జిల్లాకు పద్మశ్రీ అవార్డు తెచ్చిన రామయ్య చరిత్రను పుస్తకంగా మలచి మనకు అందించిన రచయిత నరేష్ జిల్లా అభినందనీయుడని పేర్కొన్నారు. అక్షరాల తోవ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నరేష్ జిల్లా రచించిన విత్తనం నుంచి మహా వృక్షంగా వన జీవి జీవితం పుస్తకావిష్కరణ ఖమ్మం లోని ఆక్స్ ఫర్డ్ హైస్కూల్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడారు. కడవెండి వేణుగోపాల్, ప్రముఖ కవులు రచయితలు అట్లూరి వెంకటరమణ, సైదులు ఐనాల, నయిమ్ పాషా, ప్రముఖ రచయిత్రి పురిమళ్ల సునంద హాజరై మాట్లాడారు. తొలుత రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రచయిత నరేష్ జిల్లాను సన్మానించారు. రామయ్య సతీమణి జానకమ్మ, నామా పురుషోత్తం, రాచమళ్ల ఉపేందర్, ప్రముఖ బాల సాహితీ వేత్త సయ్యద్ షఫీ, కవి వాగ్గేయకారుడు కన్నెగంటి వెంకటయ్య, కవులు ఎంవీ రమణ, కోంద్రు బ్రహ్మం, నాగమోహన్ పాల్గొన్నారు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పలువురు కవులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇల్లెందు టౌన్ 14(ఆంధ్రజ్యోతి): గత నెలలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన అదివారం చోటుచేసుకుంది. ఇల్లెందు పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని స్టేషన్ బస్తీకి చెందిన గొడుగు సత్యనారాయణ(50) గత నెల13న తన మోటర్‌సైకిల్‌పై వస్తుండగా గోవింద్ సెంటర్ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో మోటర్‌సైకిల్ ఢీ కొనడంతో తీవ్రగాయలపాలయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని వెంటనే ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దుమ్ముగూడెం సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ట్రాక్టరు సీతారాంపురంకు చెందినదిగా గుర్తించారు. కాగా పట్టుబడిన ట్రాక్టర్ వెనుక మరో రెండు ఇసుక ట్రాక్టర్లు బయల్దేరగా, ఈ విషయం తెలిసిన వెంటనే అవి అక్కడే ఆగిపోయాయి. పట్టుబడిన ట్రాక్టర్‌పై కేసు పెడతామని సీఐ వెంకటప్పయ్య తెలిపారు.

ద్విచక్ర వాహనం, కారు ఢీ..

● వ్యక్తికి గాయాలు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం, కారు ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మండలంలోని సదాశివునిపాలెం చోటుచేసుకుంది. 108సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం. వేంసూరు మండలం భీమవరం వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న పంతంగి సుబ్బారావు సదాశివునిపాలెం శివారులోని గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే వద యూటర్న్ తీసుకుంటున్న కారు ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన సుబ్బారావును ప్రథమ చికిత్స అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యభిచార గృహంపై దాడి

బోనకల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఒక విటుడు, మహిళతో పాటు నిర్వాహకురాలును దాడుల్లో పట్టుకున్నారు. పంచనామా నిర్వహించి, ముగ్గురిని అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొందరు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు గ్రామానికి చేరుకొని దాడులు జరిపారు.

అప్పీల్ చేస్తానంటూ న్యాయవాది మోసం

ఇల్లెందుటౌన్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో అప్పీల్ చేస్తానంటూ ఓనకిలీ న్యాయవాది బురిడి కొట్టించాడు. ఆదివారం బాధితుడు షేక్ ఫకిర్‌సాహెబ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు పట్టణంలోని సత్యనారాయణపురానికి చెందిన షేక్ ఫకిర్‌సాహెబ్ పాల్వంచకు చెందిన ఓ యువతిని వివాహం ఆడాడు. వివాహం అయిన కొద్ది రోజులకే భార్యభర్తల నడుమ మనస్పర్థాలు రావడంతో 2022లో కొత్తగూడెం జిల్లా కోర్టులో భార్య భరణం కేసు వేసింది. విచారణ చేపట్టిన కోర్టు ఆమెకు భరణం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. అయితే ఈ కేసులో ఫకిర్‌సాహెబ్ తరుపున వాధిస్తానంటూ ఇల్లెందు పట్టణంలోని స్టేషన్‌బస్తీకి చెందిన ఓ వ్యక్తి ఫకీర్‌సాహెబ్ వద్ద రూ.35వేలు తీసుకున్నాడు. అతని తరుపున వకల్తా వేయకపోవడంతో భరణం చెల్లించలంటూ జిల్లా జడ్జీ తీర్పుఇచ్చాడు. న్యాయవాది నంటు చెప్పుకుంటూ వ్యక్తిపై అనుమానాలు రావడంతో కొత్తగూడెం, ఇల్లెందు కోర్టులలో విచారణ చేసినట్లు తెలిపాడు. కాగా సదరు న్యాయవాది అసలు న్యాయవాది కాదు అంటూ సమాచారం తెలవడంతో హైకోర్టు బారు కౌన్సిల్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు బారు కౌన్సిల్ జనరల్ సెక్రటరీ నాగలక్ష్మీ రాత పూర్వకంగానే సదరు వ్యక్తి న్యాయవాది కాదు అంటూ లేఖ ఇచ్చారు. దీంతో తనను మోసం చేశాడంటూ న్యాయవాదిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన్నపటికీ స్పందించడం లేదంటూ పకిర్‌సాహెబ్ వాపోయడు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరాడు.

హాస్టల్ విద్యార్థులపై వంటమనిషి దాడి

» వీఎంబంజర్‌లో ఘటన


గాయాలు చూపిస్తున్న విద్యార్థి

పెనుబల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్‌లోని ఎస్సీ హాస్టల్‌లోని విద్యార్థులు ఆటలాడుకుంటున్నారని వంటమనిషి చితకబాదిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులు ఆవరణంలో ఆటలాడుకుంటున్నారు. ఇది గమనించిన వంట మనిషి బురదలో ఎందుకు ఆటలాడుతున్నారంటూ కర్ర పట్టుకొని విద్యార్థులను చితకబాదారు. దీంతో విద్యార్థులకు మొఖం, వీపుపై వాతలు తేలాయి. వంట మనిషి చేతిలో దెబ్బతిన్న విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఫోన్లు చేసి రప్పించుకున్నారు. పిల్లల ఒంటిపై దెబ్బలు చూసిన తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మందలించకుండా కర్రతో ఇష్టం వచ్చినట్లు కొట్టడం ఏంటని ప్రశ్నించారు. విద్యార్థులపై వంట మనిషి చేయి చేసుకోవడం పట్ల వార్డెన్‌ను ప్రశ్నించగా విద్యార్థులను విచారించి వంట మనిషిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనారోగ్యంతో గోగినేని మృతి


పుల్లయ్య(ఫైల్)

నేలకొండపల్లి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి రుచి చికెన్ సెంటర్ అధినేత, గువ్వలగూడెం గ్రామానికి చెంది న గోగినేని పుల్లయ్య(58) ఆదివారం ఖమ్మంలోని ఓప్రైవేటు వైద్యశాలలో గుండెపోటుతో మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన శాఖమూరి రమేష్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, వెన్నపూసల సీతారాములు, రావెళ్ళ శ్రీనివాసరావు, కోలేటి మస్తాన్‌రావు, మద్దినేని మహేష్, చవళం ప్రవీణ్‌కుమార్ అక్కినేని నాగేశ్వరరావు, కొమ్మూరి నరేష్, ఏటుకూరి రామారావు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గృహోపకరణాల దగ్ధం



అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మిగూడెంలో శనివారం రాత్రి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ముక్తేశ్వరావు ఇంట్లో రాత్రి పది గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కుటుంబసభ్యులు అంతా పరుగులు తీశారు. మంటల్లో ఇంట్లో ఉన్న సామాగ్రి కాలిపోయింది.



ఫీజు బకాయిల కోసం నేడు మహా ర్యాలీ

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజులబకాయిల కోసం సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ సంఘాల రాష్ట్ర, జిల్లా బాధ్యులు ఇటికాల రామకృష్ణ, వంగూరి వెంకటేష్, తుడుం ప్రవీణ్, గోకినేపల్లి మస్తాన్, మందా సురేశ్ మాట్లాడారు. ఫీజురియంబర్స్‌మెంట్ మంజూరు చేయకపోవటంతో ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు కనీసం ధ్రువపత్రాలు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా దామోదర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

కామేపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండలం కొత్తలింగాలలో శ్రీకోటమైసమ్మ ఆలయంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కేకును మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కట్ చేశారు. వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి కేకు కట్ చేసి పులువురికి తినిపించారు. ఈకార్యక్రమంలో రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, జీ. రాంబాబు, గోపిరెడ్డి, సరిరాం నాయక్, దొడ్డ వేణు, చల్లా మల్లయ్య, యడ్లపల్లి బాబు, ధారావత్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



మహిళా నాయకురాలికి కేకు తినిపిస్తున్న గోపాల్‌రెడ్డి

రిజర్వేషన్ల సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి):బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధనకోసం ఆమరణ నిరాహారదీక్ష చేపడుతున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘంజిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంనగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబరు26న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమెను స్పూర్తిగా తీసుకుని పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. ఈపోరాటంలో అన్ని కులసంఘాలు, రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు జిల్లా ప్రధాన కార్యదర్శి మసనం శివరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు తేలూరి రమేష్, శివనాగేశ్వరరావు, గాజుల శ్రీదేవి, మోడేపల్లి వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో అభినయ రుద్ర చిన్నారుల ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కల్చరల్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బిర్లా మందిర్ భాస్కర్ ఆడిటోరియంలో ఆదివారం 6వజాతీయ స్థాయి నృత్య, సంగీత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఖమ్మం అభినయ రుద్ర నాట్యాలయ చిన్నారులు ప్రతిభ కనబరిచారు. సోలో, గ్రూప్ భరతనాట్యం విభాగాల్లో బహుమతులు సొంతం చేసుకున్నారు. సీనియర్ గ్రూప్‌విభాగంలో ప్రథమ,జూనియర్ గ్రూప్‌విభాగంలో ద్వితీయ, సబ్ జూనియర్ గ్రూప్‌విభాగంలో తృతీయ బహుమతులు అందుకున్నారు. సోలో సబ్ జూనియర్‌లో త్రిషిక, జూనియర్స్‌లో రిధి, సీనియర్స్‌లో వైశాలి బహుమతులు గెలుచుకున్నారు. నాట్యాలయ గురువు ఫణిల్ కణతాలను నిర్వాహకులు అభినందించారు.



బహుమతులు గెలుచుకున్న చిన్నారులు

ధరలు అడిగితే దంచుడే!

- వీధివ్యాపారుల ప్రాంగణంలో ఇష్టారాజ్యం
- దెబ్బలు తిన్న బాధితుల్లో కానిస్టేబుల్, హోంగార్డు, టీచర్లు
- ధరల బోర్డు ఉండదు... అద్దెలు కట్టరు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు



ఖమ్మంమార్కెట్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున పాత బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న అత్యంత ఖరీదైన ప్రాంతం అది. ప్రజలకు తక్కువ ధరలకు తాజా కూరగాయలు అందిచాలనే లక్ష్యంతో నాటి ప్రభుత్వం 2020లో ఆప్రదేశానికి వీధి వ్యాపారుల ప్రాంగణంగా నామకరణం చేసి 60 మంది వ్యాపారులకు సరిపోయేలా స్టాళ్లు ఏర్పాటు చేసింది. ఇదంతా బాగానే ఉన్నా అక్కడ కేవలం ఒక వర్గానికే చెందిన వ్యాపారులు పాగా వేశారు. ఇష్టారాజ్యంగా ఎక్కువ ధరలకు అమ్ముతూ వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ధరలపై ప్రశ్నించిన కొనుగోలుదారులపై అక్కడున్న వ్యాపారులందరూ ఏకమై పిడిగుద్దులతో విరుచుకుపడటం వారి నైజం. అక్కడున్న వారంతా ఐదు కుటుంబాలకు చెందిన బంధువులే కావడంతో ఒక వ్యాపారి వద్ద గొడవ జరిగితే వారంతా ఒక్కటై వినియోగదారుడి వీపు విమానం మోత మోగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరేళ్లల్లో స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో 18కి పైగా కేసులు నమోదు కావడం విశేషం. అయినా అధికారులు ఎవరూ సదరు మార్కెట్‌పై పట్టించుకోక పోవడం వినియోగదారులను విస్మయానికి గురిచేస్తుంది. దీంతో ఆ వీధి వ్యాపారుల ప్రాంగణానికి కూరగాయలు కొనడానికి వెళ్లాలంటేనే హడలుతున్నారు.

రైతుబజారు కంటే డబుల్ రేట్లు

వీధి వ్యాపారుల ప్రాంగణంలో అధిక ధరలపై ప్రశ్నించినా, కొసరినా అది అక్కడి వ్యాపారులు నేరంగా పరిగణిస్తారు. అలా ప్రశ్నించిన వినియోగదారులు భౌతిక దాడులకు గురికాక తప్పదు. ఈ క్రమంలో వ్యాపారుల చేత దెబ్బలు తిన్న వారిలో పలువురు పోలీస్, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉండటం విశేషం. వారు చెప్పిన రేటుకు కొనాల్సిందేనంటూ బుకాయిస్తారు. ఈ స్థలం మాదే ఇక్కడ మేం చెప్పిందే రేటు అంటూ వినియోగదారులపై విరుచుకుపడతుండటంతో వినియోగదారులు బెంబేతెత్తుతున్నారు. ఇటీవల ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు సెలవు రోజున తన భార్యతో వీధి వ్యాపారుల ప్రాంగణానికి వెళ్లారు. ఒక వ్యాపారి వద్ద అతడు కీరా దోస రేటు అడిగాడు వ్యాపారి కిలో రూ.60 చెప్పడంతో అదేంటి బయట రైతుబజార్లలో కిలో రూ.30 ఉంది కదా అని అడిగారు. అక్కడి వ్యాపారులు అంతరూ కలిసి సదరు ఉపాధ్యాయుడిని భార్య ముందే చితక బాదారు. దీంతో ఆ ఉపాధ్యాయుడు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐనా ప్రయోజనం లేదని వాపోయాడు. అంతే కాకుండా సదరు మార్కెట్‌లో వ్యాపారం చేసుకునేందుకు తమకు అవకాశం ఇవ్వాలంటూ ఇతర బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవట్లేదని తెలుస్తోంది.

ధరల బోర్డు ఉండదు... అద్దెలు కట్టరు

సుమారు రూ.1.40కోట్ల నిధులతో నిర్మించి అభివృద్ధి చేసిన వీధి వ్యాపారుల మార్కెట్‌లో ధరల సూచిక బోర్డు లేక పోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వ్యాపారులంతా వాస్తవ ధర కన్నా ఎక్కువ ధరలకు అమ్మకాలు చేస్తుండటంతో వినియోగదారులు మండిపడుతున్నారు.ప్రభుత్వానికి చెల్లించాల్సిన నామమాత్రపు అద్దెలు కూడా కట్టరని ఆరోపణలు ఉన్నాయి. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రాంగణంలో ప్రభుత్వ నిధులు ఎన్ని కోట్లు ఉపయోగించినా ప్రయోజనం లేదని అద్దెల రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన కిరాయిలు అసలు రాక పోవడంతో ప్రభుత్వ ఆదాయానికిగండి ఏర్పడుతుందని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి ధరల బోర్డును ఏర్పాటు చేసి అద్దెల వసూలకు, మార్కెట్ పర్యవేక్షణకు మార్కెటింగ్ శాఖకు గాని, ఇతర శాఖలుకు అప్పగించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

డిమాండ్ మేరకు యూరియా పంపిణీ జరపాలి



మాట్లాడుతున్న అశోక్

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ డిమాండ్ మేరకు యూరియాను తక్షణమే పంపిణీ చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. పోలీసు స్టేషన్‌లకు రైతులు వెళ్లి కూపన్లు తీసుకోవటం ప్రభుత్వాలకే సిగ్గుచేటుగా ఆరోపించారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శిరోమణి మాట్లాడుతూ గతేడాది భారీ వర్షాలతో నష్టపోయిన కుటుంబాలకు నేటి వరకు ఇంకా పరిహారం అందలేదని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఝాన్సి, ప్రతాపనేని శోభ, తేజానాయక్, నామాల ఆజాద్, రాకేష్ పాల్గొన్నారు.

రుక్కమ్మ జీవితం ఆదర్శం

ఖమ్మంరూరల్,సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన సీపీఎం సానుభూతి పరురాలు రుక్కమ్మ జీవితం ఆదర్శం అని సూర్యాపేట జిల్లా సీపీఎం కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. రుక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆదివారం నాగార్జునరెడ్డి ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో కార్పోరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, తమ్మినేని వీరభద్రయ్య, రంగారావు, నవీన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ డివిజన్ కమిటీ ఎన్నిక



నరేశ్, నాగరాజు

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ ఖమ్మం డివిజన్ కమిటీని ఆదివారం నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల రమేశ్, మధు ప్రకటన విడుదల చేశారు. డివిజన్ అధ్యక్ష కార్యదర్శులుగా కూచిపూడి నరేశ్, రావులపాటి నాగరాజులతో పాటుగా డివిజన్ కమిటీలో27మందిని నియామకం చేశామన్నారు. వీరిలో 12మంది ఆఫీస్ బేరర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చెప్పారు.

వైద్య శిబిరం విజయవంతం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నేలకొండపల్లి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సీపీఎం కార్యాలయం రావెళ్ళభవన్‌లో జరిగిన నెలనెలా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. 153 మంది రోగులను వైద్యులు పరీక్షించారు. మధుమేహం, బీపీ, కంటి తదితర వ్యాధులతో పాటు సాధారణ జబ్బులకు వైద్యులు చికిత్స చేశారు. 36 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధులకు రూ.100లకే నెలకు సరిపడా మందులను అందచేసారు. డాక్టర్ వినోద్‌బాబు,డాక్టర్ వినూష,డాక్టర్ జయశ్రీ, డాక్టర్ హస్నద్‌బాబాలు వైద్యసేవలందించగా గ్రామీణ వెద్యులు సహకరించారు. ఏటుకూరి రామారావు, కేవిరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, మంకెన నర్సింహారావు, సామాల మల్లికార్జున్, దండా సైదారావు, చిట్లా భాస్కరరెడ్డి, వల్లంచెట్ల భాస్కరరావు వలంటీర్లుగా పని చేశారు.

ప్రశాంతంగా సర్వేయర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లైసెన్స్ సర్వేయర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో చేపట్టిన థియరీ పరీక్షకు 129 మంది అభ్యర్థులకు 128 మంది హాజరు అయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ప్లాటింగ్ పరీక్షకు 205 మంది అభ్యర్థులకు గాను 202మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణ పర్యవేక్షణ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, సీపీవో ఏ. శ్రీనివాస్ పర్యవేక్షించారు.



లైసెన్స్ సర్వేయర్ పరీక్ష పత్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

పేద కుటుంబాలకు మంత్రి పొంగులేటి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న శివరామకృష్ణ

తిరుమలాయపాలెం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలువురు మృతుల కుటుంబాల సభ్యులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం, హైదరసాయిపేట, దమ్మాయిగూడెం, బీరోలు, బచ్చోడు, సోలిపురం, సుబ్లేడు రఘునాధపాలెం తదితర గ్రామాల్లోని 70మంది మృతుల కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికిరూ.10వేల వంతున అందించారు. ఈసాయాన్ని ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ అందించారు. ఈకార్యక్రమంలో మాజీఎంపీపీ బోడ మంగిలాల్, జడల నగేష్, తమిరవెంకటరెడ్డి,జడల రమేష్, గుగ్గిళ్ల అంబేద్కర్, గుర్రాల శ్రీనివాసరెడ్డి, మెట్టు అనిల్, వెంకట్ పాల్గొన్నారు.

మకాం మార్చని మెప్మా

(5వ పేజీ తరువాయి)

మాత్రం మయూరి సెంటర్‌లో మెప్మాకు రూ.కోట్లు విలువ చేసే సొంత కార్యాలయం అందుబాటులో ఉంది. ఖమ్మం నగర పాలక సంస్థకు ఐదేళ్ల క్రితం నూతన భవనం అందుబాటులోకి రావడంతో.. అప్పటి ప్రత్యేక పరిస్థితుల్లో డీఎంసీ కార్యాలయాన్ని కేఎంసీలో ఏర్పాటు చేశారు. తర్వాత ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం కూడా ఏడాది క్రితం చేరింది. దీంతో మయూరి సెంటర్‌లోని సొంత భవనాన్ని వినియోగించక పోవడంతో అది కాస్త ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతోంది.

● పుష్కలంగా నిధులు

ఖమ్మం జిల్లా మెప్మా పరిధిలో రూ.80లక్షలకు పైగా నిధులు అందుబాటులో ఉన్నాయని తెలుస్తోంది. వాటిలో కొద్ది పాటి నిధులను వినియోగించి సొంత భవనంలో ఆధునికంగా మార్పులు చేసుకునే అవకాశం ఉంది. కేఎంసీలోని జిల్లా స్థాయి భవనాలు ఖాళీ చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య గత నెలలోనే ఆదేశాలిచ్చినట్లు సమాచారం. కానీ కేఎంసీ కార్యాలయంలో శీతలీకరణ భవనాలకు అలవాటు పడిన అధికారులు.. సొంత భవనంలోకి వెళ్లడం లేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాంగ్రెస్ నేత ముత్తయ్యకు ఘననివాళులు

తిరుమలాయపాలెం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ నాయకులు సిరిగద్దె ఉపేందర్ తండ్రి ముత్తయ్య (75) ఆదివారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు . మృతుడి భార్య ఇటీవల మృతిచెందింది. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. కాగాఆయన భౌతికకాయాన్ని ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ,మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, మాజీ ఎంపీపీ ఆలుదాసు ఆంజనేయులు,కాంగ్రెస్ నాయకులు మందడి ఇజ్రాయేల్, బత్తుల రవి, అంబేద్కర్, సైపుద్దీన్, రాజేంద్రప్రసాద్, చావా వెంకటేశ్వరరావు, జడల నగేష్ తదితరులు నివాళులర్పించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం రూరల్,సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కాచిరాజుగూడెం గ్రామం పరిధిలోని వాల్యాతండా, రేగులతండా, గ్రామాల అభివృద్ధికి ఆదివారం చేపట్టిన పాదయాత్రను డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోన్నం వెంకటరమణ, సీపీఎం మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, జిల్లా నాయకులు నంద్రా ప్రసాద్, నాయకులు నాగేశ్వరరావు, మురళి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వైరా అభివృద్ధి ప్రతిపాదనలకు మోక్షమేదీ?

- ఏడాది దాటినా రూ.వందకోట్ల నిధులకు అతీగతీ లేదు
- స్థానికుడైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కరుణ కోసం వైరా మునిసిపాలిటీ ఎదురుచూపు

వైరా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ అభివృద్ధికి స్వయంగా ముఖ్యమంత్రి కార్యాలయం అడిగి తీసుకున్న రూ.వందకోట్ల అభివృద్ధి పనులకు ఏడాది దాటినా అతీగతీ లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైరా మునిసిపాలిటీ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు సీఎంవో అధికారులు ఇచ్చిన ఆదేశాలతో ఇక్కడి నుంచి వెళ్లిన ప్రతిపాదనలకు నేటివరకు మోక్షం లభించలేదు. వైరా మండలానికే చెందిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వైరా మునిసిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన రూ.వందకోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని ఇక్కడి ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. రూ.వందకోట్లతో చేపట్టే అభివృద్ధి పనుల ప్రతిపాదనల ఫైలు ఆర్థికశాఖ మంత్రి అయిన భట్టి విక్రమార్క పేచీలోనే ఉందని వెంటనే ఆయన చొరవ తీసుకొని నిధుల మంజూరుకు మోక్షం కల్పించాలనిప్రజలు కోరుతున్నారు.

2024 ఆగస్టు 15న వైరాలో సీఎం సభ..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన రూ.రెండులక్షల రుణమాఫీకి సంబంధించి వైరాలో రైతు సదస్సు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి వైరాలో జరిగిన రైతు సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆవేదికపైనే వైరా మునిసిపాలిటీకి రూ.వందకోట్ల నిధులు మంజూరు చేయాలని, నియోజకవర్గంలో ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఒక వినతిపత్రం సమర్పించారు.



మునిసిపాలిటీ కార్యాలయం

సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలు..

సీఎం హామీ మేరకు కొన్నినెలల తర్వాత వైరా మునిసిపాలిటీ అభివృద్ధి కోసం రూ.వందకోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపించాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఆదేశాలొచ్చాయి. ఆ వెంటనే ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అధికార, ప్రతిపక్ష నాయకులతో సమావేశాన్ని నిర్వహించి మునిసిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం రూ.వందకోట్ల నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపించారు. ఆప్రతిపాదనలపై ఆర్థికశాఖ మంత్రి అయిన భట్టి విక్రమార్క ఆమోదం ముద్ర వేయాల్సి ఉంది. ఈ నిధుల మంజూరుకు సంబంధించి మే 24న వైరాలో జరిగిన నిరుద్యోగ జాబ్‌మేళా సభ అనంతరం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి అవసరమైన ప్రక్రియను వెంటనే పూర్తిచేస్తానని స్పష్టం చేశారు.

ప్రతిపాదించిన ముఖ్యమైన పనుల వివరాలు...



రింగ్ లేక అస్తవ్యస్తంగా ఉన్న వైరాలో ట్రాఫిక్

మొత్తం 880పనులను రూ.వందకోట్లకు ప్రతిపాదించారు. వాటిలో ముఖ్యంగా మునిసిపాలిటీ డంపింగ్‌యార్డు, అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి రూ.పదికోట్లు, రిజర్వాయర్ ఆనకట్ట అభివృద్ధికి రూ.ఆరున్నరకోట్లు, ప్రధాన రహదారి నుంచి కేవీసీఎం మీదుగా కమ్మవారి కల్యాణ మండపం వరకు రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణానికి రూ.ఐదుకోట్లు, లైబ్రరీ పునర్నిర్మాణానికి రూ.85లక్షలు, జాతీయ ప్రధాన రహదారిలోని సాయిబాబా మందిరం నుంచి రిజర్వాయర్ కుడికాల్వ గట్టును మధిర వెళ్లే ఇందిరమ్మ కాలనీ వరకు అభివృద్ధి చేసేందుకు రూ.ఏడుకోట్లు, వైరాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి దాదాపు రూ.ఆరుకోట్లు, కమ్యూనిటీహాల్స్ డ్రెయినేజీలు, సీసీ రోడ్లు ఇతర అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.వందకోట్లకు ప్రతిపాదనలు పంపించారు. వీటిని వెంటనే మంజూరు చేస్తానని భట్టి విక్రమార్క ఎమ్మెల్యే అలాగే నాయకులకు స్పష్టతనిచ్చారు. ఇప్పటికైనా భట్టి విక్రమార్క ఈ నిధులను మంజూరు చేసి మునిసిపాలిటీ అభివృద్ధికి కృషిచేయాలని ఇక్కడి ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పోరాటాల చరిత్ర కమ్యూనిస్టు యోధులదే

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

కొణిజర్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూమికోసం, భుక్తికోసం, సమసమాజ స్థాపన కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల ద్వారా వేలాది ఎకరాలు అందించిన ఘనత సీపీఐ యోధులదేనని సీపీఐ జాతీయ సమితి సభ్యుడుబాగం హేమంతరావు అన్నారు. ఆదివారం సీపీఐ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా తనికెళ్లలో గడల సీతారామయ్య స్థూపం వద్ద కొణిజర్లలో దొండపాటి వెంకయ్య స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు పేదల రైతాంగ, కార్మిక సంస్థలపై వెన్నంటే ఉండి పోరాడుతుందన్నారు. అమర వీరుల త్యాగాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లానాయకుడు యర్రాబాబు, దొండపాటి రమేష్ పోటు కళావతి, తనికెళ్ల సీపీఐ సీనియర్‌నాయకులు గడల సీతారామయ్య, గడల బాస్కరరావు, మండల సహాయ కార్యదర్శి మునిగే కోటేశ్వరరావు, నాయకులు స్వర్ణ రమేష్, యాస వెంకటేశ్వరరావు గడల శ్రీనివాసరావు, తోటపల్లిసీతారాములు, చింతల ఆదినారాయణ, కొమ్మినేని వెంకయ్య తదితరలు పాల్గొన్నారు.



కొణిజర్లలో దొండపాటి వెంకయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న బాగం

వైరా అభివృద్ధి ప్రతిపాదనలకు మోక్షమేదీ..?

» ఏడాది దాటినా రూ.వందకోట్ల నిధులకు అతీగతీ లేదు

» స్థానికుడైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కరుణ కోసం వైరా మునిసిపాలిటీ ఎదురుచూపు

వైరా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ అభివృద్ధికి స్వయంగా ముఖ్యమంత్రి కార్యాలయం అడిగి తీసుకున్న రూ.వందకోట్ల అభివృద్ధి పనులకు ఏడాది దాటినా అతీగతీ లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైరా మునిసిపాలిటీ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు సీఎంవో అధికారులు ఇచ్చిన ఆదేశాలతో ఇక్కడి నుంచి వెళ్లిన ప్రతిపాదనలకు నేటివరకు మోక్షం లభించలేదు. వైరా మండలానికే చెందిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వైరా మునిసిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన రూ.వందకోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని ఇక్కడి ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. రూ.వందకోట్లతో చేపట్టే అభివృద్ధి పనుల ప్రతిపాదనల ఫైలు ఆర్థికశాఖ మంత్రి అయిన భట్టి విక్రమార్క పేచీలోనే ఉందని వెంటనే ఆయన చొరవ తీసుకొని నిధుల మంజూరుకు మోక్షం కల్పించాలనిప్రజలు కోరుతున్నారు.

2024 ఆగస్టు 15న వైరాలో సీఎం సభ..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన రూ.రెండులక్షల రుణమాఫీకి సంబంధించి వైరాలో రైతు సదస్సు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి వైరాలో జరిగిన రైతు సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆవేదికపైనే వైరా మునిసిపాలిటీకి రూ.వందకోట్ల నిధులు మంజూరు చేయాలని, నియోజకవర్గంలో ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఒక వినతిపత్రం సమర్పించారు.



మునిసిపాలిటీ కార్యాలయం

సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలు..

సీఎం హామీ మేరకు కొన్నినెలల తర్వాత వైరా మునిసిపాలిటీ అభివృద్ధి కోసం రూ.వందకోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపించాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఆదేశాలొచ్చాయి. ఆ వెంటనే ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అధికార, ప్రతిపక్ష నాయకులతో సమావేశాన్ని నిర్వహించి మునిసిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం రూ.వందకోట్ల నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపించారు. ఆప్రతిపాదనలపై ఆర్థికశాఖ మంత్రి అయిన భట్టి విక్రమార్క ఆమోదం ముద్ర వేయాల్సి ఉంది. ఈ నిధుల మంజూరుకు సంబంధించి మే 24న వైరాలో జరిగిన నిరుద్యోగ జాబ్‌మేళా సభ అనంతరం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి అవసరమైన ప్రక్రియను వెంటనే పూర్తిచేస్తానని స్పష్టం చేశారు.

ప్రతిపాదించిన ముఖ్యమైన పనుల వివరాలు...



రింగ్ లేక అస్తవ్యస్తంగా ఉన్న వైరాలో ట్రాఫిక్

మొత్తం 880పనులను రూ.వందకోట్లకు ప్రతిపాదించారు. వాటిలో ముఖ్యంగా మునిసిపాలిటీ డంపింగ్‌యార్డు, అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి రూ.పదికోట్లు, రిజర్వాయర్ ఆనకట్ట అభివృద్ధికి రూ.ఆరున్నరకోట్లు, ప్రధాన రహదారి నుంచి కేవీసీఎం మీదుగా కమ్మవారి కల్యాణ మండపం వరకు రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణానికి రూ.ఐదుకోట్లు, లైబ్రరీ పునర్నిర్మాణానికి రూ.85లక్షలు, జాతీయ ప్రధాన రహదారిలోని సాయిబాబా మందిరం నుంచి రిజర్వాయర్ కుడికాల్వ గట్టును మధిర వెళ్లే ఇందిరమ్మ కాలనీ వరకు అభివృద్ధి చేసేందుకు రూ.ఏడుకోట్లు, వైరాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి దాదాపు రూ.ఆరుకోట్లు, కమ్యూనిటీహాల్స్ డ్రెయినేజీలు, సీసీ రోడ్లు ఇతర అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.వందకోట్లకు ప్రతిపాదనలు పంపించారు. వీటిని వెంటనే మంజూరు చేస్తానని భట్టి విక్రమార్క ఎమ్మెల్యే అలాగే నాయకులకు స్పష్టతనిచ్చారు. ఇప్పటికైనా భట్టి విక్రమార్క ఈ నిధులను మంజూరు చేసి మునిసిపాలిటీ అభివృద్ధికి కృషిచేయాలని ఇక్కడి ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాల ముందు నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులు

మూడో రోజుకు.. పాఠశాల కార్మికుల నిరవధిక సమ్మె

» సమస్యలను పరిష్కరించాలి.. సీపీఐ, ఏఐటీయూసీ

కల్లూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికుల నిరవధిక సమ్మె ఆదివారం నాటికి మూడవ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రాంగణం ముందు కార్మికులు బైఠాయించి సమ్మె చేశారు. ఈ సమ్మె శిబిరాన్ని సీపీఐ మండల జిల్లా ఏఐటియూసీ నాయకులు దమాల దయాకర్, వేము రాంబాబులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంవగా వారు ప్రసంగిస్తూ పాత పద్ధతిలోనే ఆశ్రమ పాఠశాలల కార్మికులకు వేతనం అందించాలన్నారు. కనీస వేతన చట్టం ప్రకారం రూ. 26 వేలు వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యించాని వారు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో 18 ఆశ్రమ పాఠశాలల్లో 80 మంది కార్మికులు ఉన్నారని వారికి ఇబ్బంది పెట్టకుండా వేతనాలు అందించి ఆదుకోవాలని అన్నారు. ఉద్యోగ భద్రత, టైం స్కేల్ చేయాలని, జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు అందించాలని చెప్పారు. కార్మికులవి న్యాయపరమైన సమస్యలు కావటంతో సానుకూలంగా ప్రభుత్వం వాటిని పరిష్కరిచేలా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటియూసీ కార్మికులు మల్లయ్య. పిచ్చయ్య. భద్రయ్యతోపాటుగా కార్మికులు రాఘవమ్మ, సత్యానారాయణ, సోనా పాల్గొన్నారు.

అలుగు పారుతున్న పులిగుండాల ప్రాజెక్టు

పెనుబల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి 20కిలోమీటర్ల దూరంలో అటవీప్రాంతంలో ఉన్న పులిగుండాల ప్రాజెక్టు శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆదివారం నాలుగు అడుగుల మేర అలుగు పారుతుంది. ఎన్నో ఏళ్లుగా అలుగుపారని పులిగుండాల ప్రాజెక్టు భారీగా వరదనీరు వస్తుండటంతో ఆప్రాంత ప్రజలు చూసేందుకు బారులుతీరారు. దీంతో ప్రాజెక్టు ప్రాంతం సందర్శకులతో నిండింది.



అలుగు పారుతున్న ప్రాజెక్టు

పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం సానుకూలం

» ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

» సత్తుపల్లి పెన్షనర్ల అధ్యక్షుడిగా వైకుంఠరావు

సత్తుపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలను మంచిగా చూసుకోవాలనే ఉద్దేశ్యం ప్రభుత్వంపై ఉంటుందని, ఈ క్రమంలో పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. ఆదివారం సత్తుపల్లిలోని కళాభారతి ఆడిటోరియంలో ఆల్ పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్స్ సత్తుపల్లి డివిజన్ మహాసభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి పాల్గొన్నారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ ఏ మాత్రం సరిపోదని, ఇదే విషయంపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని చెప్పారు. రాష్ట్రం చాలా అప్పుల ఊబిలలో ఉందని, ఆలస్యమైనా పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, గత ప్రభుత్వం వలే వదిలేయదని, ఒకదాని తర్వాత ఒకటి చేసుకుంటూ వస్తున్నామన్నారు. పీఆర్‌సీ, హెల్త్‌కార్డులు ఇతర సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యేగా ముందుంటామని, అలాగే ఆరోగ్య సమస్యలపై తాము సేవలందిస్తామని, ఇకముందూ పరస్పరం సహకరించుకుందామన్నారు. 80సంవత్సరాలు పూర్తిచేసుకున్న సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించగా ఆల్ ఇండియా లెవల్‌లో ఉన్న తమ సంఘానికి సంఘం భవనానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.



సత్తుపల్లిలో ఎమ్మెల్యే రాగమయిని సన్మానిస్తున్న పెన్షనర్లు

సత్తుపల్లి పెన్షనర్ల అధ్యక్షుడిగా వైకుంఠరావు

ఆల్ పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్స్ సత్తుపల్లి డివిజన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.వైకుంఠరావు, బాల నాగేశ్వరరావు, కోశాధికారిగా జీవీఎన్.సాయి, గౌరవ అధ్యక్షుడిగా వంగరి పద్మారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.గోపీచంద్, కె.నాగేశ్వరరావు, బాధ్యులు ఎంఎస్ఆర్.శర్మ, దుస్సా వెంకటేశ్వర్లు, ఎం.గంగాధర్‌రాజు, గద్దె వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ఎస్.రమేష్, పులిచర్ల నాగేశ్వరరావు, వనమా బోసు, విశ్వనాథం, తిరుపతిరావు, రాఘవరావు, సీహెచ్.నాగేశ్వరరావు, బాను, గీతాకుమారి, తాయారు, పద్మావతి తదితర పెన్షనర్లు పాల్గొన్నారు.

హనుమాయమ్మకు మాజీమంత్రి జలగం నివాళి

తల్లాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సరికొండ హనుమాయమ్మకు మాజీ మంత్రి జలగం ప్రసాదరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సరికొండ పాండురాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, సీనియర్ నాయకులు కాపా రామారావు, గుండ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సరికొండ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీమంత్రి జలగం



ఆలయానికి వచ్చిన కుర్చీలు, టేబుళ్లు

ముత్యాలమ్మ ఆలయానికి కుర్చీల వితరణ

పెనుబల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లిలోని ముత్యాలమ్మతల్లి ఆలయానికి అదే గ్రామానికి చెందిన బొర్రా సుబ్బారావు, శాంతమ్మల కుమార్తెలు కృష్ణకుమారి, ఈడే శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు రూ.15వేల విలువైన కుర్చీలు, టేబుళ్ల వితరణ చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

17నుంచి బీజేపీ సేవా పక్షోత్సవాలు

వైరా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17వతేదీ నుంచి అక్టోబరు 2వరకు బీజేపీ సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తామని పార్టీ పట్టణ అధ్యక్షుడు మనుబోలు వెంకటకృష్ణ తెలిపారు. 17నుంచి ప్రారంభించే సేవా పక్షోత్సవ కార్యక్రమాల విజయవంతం కోసం ఆదివారం వైరాలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సేవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నరేష్, పి.వెంకటేష్, వల్లెపు అనిల్, సీహెచ్.రామారావు, తాటికొండ సంధ్య, తాతా ఆదినారాయణ, దిలీప్, రమేష్, సుభాష్, వేణు, ఉదయ్ పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

మధిర,సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకమైనదని అమ్మ ఫౌండేషన్ చైర్మన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని అన్నారు. ఆదివారం మధిరలోని పివిఆర్ కల్యాణ మండపంలో జరిగిన మధిర ప్రెస్ క్లబ్ నూతన కమిటీ పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హజరయి మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండేది జర్నలిస్టులేనని, సమాజభివృద్ధిలో వారి పాత్ర చాలా కీలకమని తెలంగాణ సాధనలో వారి పాత్ర మరువలేనిదని అన్నారు. అందరి సమస్యలు వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కృషి చేసే జర్నలిస్టుల సమస్యలు మాత్రం అనేక ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదని వారు అనేక ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఇళ్లు ఇళ్ల స్థలాలతోపాటు ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులతోపాటు డా.వాసిరెడ్డి రామనాథం, పుతుంబాక కృష్ణప్రసాద్, బెజవాడ రవి, ఆర్.రంగారావు, నాగుర్‌వలీ, సైదులు, బ్రహ్మారెడ్డి, బండారు నరసింహరావు, రంగా హనుమంతరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నందిని

భట్టి నాయకత్వంలోనే అభివృద్ధి సాధ్యం

చింతకాని, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భట్టి నాయకత్వంతోనే అభివృద్ధి సాధ్యమని, రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని భట్టి అభివృద్ధి చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొదుమూరు, లచ్చగూడెం, అనంతసాగర్ గ్రామాల్లో ఆమె పర్యటించారు. కొదుమూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో శస్త్రచికిత్స పొందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెంట్యాల అప్పారావును పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. లచ్చగూడెం గ్రామానికి చెందిన ఆత్మ కమిటీ డైరక్టర్ కొప్పుల గోవిందరావు తండ్రి కొప్పుల బుచ్చయ్య ఇటీవల మృతిచెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం అనంతసాగర్ గ్రామంలో నిర్వహించిన పార్టీ చేరికల కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. భట్టి అభివృద్ధిని చూసి అనేక మంది కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితులవుతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 300 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి చేరారు. సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, నూతలపాటి వెంకటేశ్వర్లు, కంచుమర్తి రామకృష్ణ, తోటకూరి ప్రగతి, నూతలపాటి మంగతాయారు పాల్గొన్నారు.

డీపీఎం యూనిట్‌లో రఘురాంకు స్థానం



కల్లూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న డిస్ట్రిక్ ప్రోగాం యూనిట్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటియూసీ) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కల్లూరు మండలం చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన నామ రఘురాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన డిస్ట్రిక్ ప్రోగామింగ్ యూనిట్ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలో రఘురాంను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ.. 2018లో నేషనల్ హెల్త్ మిషన్‌లో డిస్ట్రిక్ కమ్యూనిటీ మొబలైజర్‌గా నియమితులైన తాను ఉద్యోగుల సమస్యల పరిష్కరంలో ఎల్లావేళలా కృషి చేస్తానని అన్నారు. అందరిని కలుపుకునే ఐకమత్యంగా ఉద్యమాలు నిర్వహిస్తామని చెప్పారు.

పింఛన్ల పెంపులో చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలి

» వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సురేష్

తల్లాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికలాంగులు, వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్లు పెంపు విషయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదర్శంగా తీసకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు దుద్దుకూరు సురేష్ అన్నారు. ఆదివారం తల్లాడలో మండల కమిటీ అధ్యక్షుడు మోదుగు కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్లు పెంచుతామని చంద్రబాబు హామి ఇచ్చి తెలంగాణ కంటే ఏపీలో ఆర్థికపరిస్థితి అధ్వాన్నంగా ఉన్నా అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబునాయుడు హామి ఇచ్చిన నెలనుంచి ఆసరా పింఛన్ల పెంపును అమలు చేసి ప్రతినెలా ఆదుకోవడం జరుగుతుందన్నారు. ముందుగా అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తెలంగాణ రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే నెలకు వికలాంగులకు రూ.6వేలకు, వితంతువులు, వృద్దులు, ఒంటరి మహిళలకు రూ.4వేలకు పెంచుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామి ఇచ్చి అధికారంలోకి వచ్చి 21నెలలైనా పెంచుకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. ఆసరా పింఛన్ల కోసం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. సోమవారం జరిగే తల్లాడ తహసీల్దార్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఎక్కిరాల నాగేశ్వరరావు మాదిగ, నాయకులు తడిమకళ్ల కృష్ణ, రావూరి కృష్ణ,అద్దంకి నరసింహారావు, తేళ్లపుట్ట ఆదాం, యేసయ్య పాల్గొన్నారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

వైరా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, టెండర్ కాంట్రాక్టర్లు విద్యార్థులకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రెబ్బవరంలో ఉన్న బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఇక్కడి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సొంత భవనం లేక అరకొర వసతులతో ఉన్న ప్రైవేట్ భవనంలో చదువులు సక్రమంగా సాగించలేక ఇబ్బందులకు గురవుతున్నారని అందువల్ల ప్రభుత్వం సొంత భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. గురుకులాలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని, అవకతవకలు లేకుండా మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ప్రతివారం గురుకులాల్లో అధికారుల పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. విద్యార్థులు చెప్పిన సమస్యలను అక్కడి ప్రిన్సిపల్, వార్డెన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ రోడ్డుకు నాసిరకం ఇసుక

వైరా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైరాలోని రిజర్వాయర్ రోడ్డులో చేపట్టిన సిమెంట్ కాంక్రీట్ నిర్మాణానికి నాసిరకం ఇసుక ఉపయోగిస్తున్నారు. మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారుల కళ్లెదుటే ఈ సీసీ రోడ్డు నిర్మాణానికి నాసిరకం ఇసుక వాడుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ టెండర్లలో ఇసుక సరఫరాకు పెట్టే షరతులకు భిన్నంగా తమకు అందుబాటులో తక్కువ ధరకు లభిస్తున్న నాణ్యతలేని ఇసుకను సీసీ రోడ్డును వాడుతున్నారు. రూ.90లక్షల సుడా నిధులతో రిజర్వాయర్ రోడ్డులో సీసీ నిర్మాణం జరుగుతుంది. ఇంకా కేవలం కొన్నిమీటర్ల సీసీ నిర్మాణం మాత్రమే మిగిలింది. టెండర్లలో నాణ్యమైన ఇసుకను వాడాలనే నిబంధన ఉంది. ఇసుక రవాణాకు సంబంధించిన లీడ్ రేటును కూడా ప్రభుత్వమే టెండర్లలో ఖరారు చేసింది. ఇప్పుడు లీడ్ ప్రకారం నాణ్యమైన ఇసుకను వాడాల్సి ఉండగా స్థానికంగా పరిసర ప్రాంతాల్లో రాళ్లు, మట్టితో నిండి ఉన్న ఇసుకను తెచ్చి సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణానికి వాడుతున్నప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు దీనిపై పర్యవేక్షణ చేసి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సన్‌రైజ్ సహకారం అభినందనీయం



అంగన్‌వాడీకేంద్రానికి కుర్చీలు అందిస్తున్న ఎంపీడీవో

తల్లాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పన కోసం సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి సహకారం అభినందనీయమని తల్లాడ ఎంపీడీవో ఏనుగు సురేష్‌బాబు కొనియాడారు. ఆదివారం తల్లాడ మండలంగొల్లగూడెం గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు సన్‌రైజ్ అభ్యుదయ సేవాసమితి ఆధ్వర్యంలో కుర్చీలు, వాటర్‌క్యాన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలుక సేవా సంస్థలు, దాతల అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగించుకోవాలని కోరారు. సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మాలతీదాసు ఉపాధ్యక్షుడు శివరాఘవ, కిరణ్‌బాబు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అటవీప్రాంతాలను తలపిస్తున్న కాలనీలు

» కానరాని పారిశుధ్య కార్యక్రమాలు..

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిపాలిటీలోని ఖాళీ ప్లాట్లు, శివారు ప్రాంతాలు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. 23వార్డులో ఏ మూలకు వెళ్లినా ఇదే పరిస్థితి. ఇటీవల 100రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టినట్లు చెబుతున్నా కొన్ని ప్రాంతాలకే పరిమితమైనట్లు పలువురి నుంచి ఆరోపణలు వస్తున్నాయి. అదేవిధంగా ఇటీవల వర్షాలు అధికంగా కురవడంతో 15రోజులకే పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. వీధికుక్కలు, పందులు స్వైర విహారంతో పాటు విషసర్పాలు ఉన్నాయని, దోమల వ్యాప్తితో అనారోగ్యాలకు గురవుతున్నట్లు వాపోతున్నారు. అయితే ఇళ్ల సముదాయాల మధ్యలోని ఖాళీప్లాట్ల నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులను స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై కమిషనర్ కె.నరసింహను వివరణ కోరగా రోడ్లవెంట చెత్తాచెదారం తొలగిస్తున్నామని, ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇస్తామని తెలిపారు.



ఖాళీ ప్రదేశాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



మకాం మార్చని మెప్మా

(5వ పేజీ తరువాయి)

మాత్రం మయూరి సెంటర్‌లో మెప్మాకు రూ.కోట్లు విలువ చేసే సొంత కార్యాలయం అందుబాటులో ఉంది. ఖమ్మం నగర పాలక సంస్థకు ఐదేళ్ల క్రితం నూతన భవనం అందుబాటులోకి రావడంతో.. అప్పటి ప్రత్యేక పరిస్థితుల్లో డీఎంసీ కార్యాలయాన్ని కేఎంసీలో ఏర్పాటు చేశారు. తర్వాత ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం కూడా ఏడాది క్రితం చేరింది. దీంతో మయూరి సెంటర్‌లోని సొంత భవనాన్ని వినియోగించక పోవడంతో అది కాస్త ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతోంది.

● పుష్కలంగా నిధులు

ఖమ్మం జిల్లా మెప్మా పరిధిలో రూ.80లక్షలకు పైగా నిధులు అందుబాటులో ఉన్నాయని తెలుస్తోంది. వాటిలో కొద్ది పాటి నిధులను వినియోగించి సొంత భవనంలో ఆధునికంగా మార్పులు చేసుకునే అవకాశం ఉంది. కేఎంసీలోని జిల్లా స్థాయి భవనాలు ఖాళీ చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య గత నెలలోనే ఆదేశాలిచ్చినట్లు సమాచారం. కానీ కేఎంసీ కార్యాలయంలో శీతలీకరణ భవనాలకు అలవాటు పడిన అధికారులు.. సొంత భవనంలోకి వెళ్లడం లేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోరాటాల చరిత్ర కమ్యూనిస్టు యోధులదే

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

కొణిజర్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూమికోసం, భుక్తికోసం, సమసమాజ స్థాపన కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల ద్వారా వేలాది ఎకరాలు అందించిన ఘనత సీపీఐ యోధులదేనని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. ఆదివారం సీపీఐ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా తనికెళ్లలో గడల సీతారామయ్య స్థూపం వద్ద కొణిజర్లలో దొండపాటి వెంకయ్య స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు పేదల రైతాంగ, కార్మిక సంస్థలపై వెన్నంటే ఉండి పోరాడుతుందన్నారు. అమరవీరుల త్యాగాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లానాయకుడు యర్రాబాబు, దొండపాటి రమేష్ పోటు కళావతి, తనికెళ్ల సీపీఐ సీనియర్‌నాయకులు గడల సీతారామయ్య, గడల బాస్కరరావు, మండల సహాయ కార్యదర్శి మునిగే కోటేశ్వరరావు, నాయకులు స్వర్ణ రమేష్, యాస వెంకటేశ్వరరావు గడల శ్రీనివాసరావు, తోటపల్లిసీతారాములు, చింతల ఆదినారాయణ, కొమ్మినేని వెంకయ్య తదితరలు పాల్గొన్నారు.



కొణిజర్లలో దొండపాటి వెంకయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న బాగం